

# హాయా నవ్వింది

- భమిడిపాటి శకుంతలాదేవి

అద్దె ఇంటి కోసం వెతికి వెతికి విసిగి వేసారి పోయేను. ఇక ఇల్లు దొరకదని ఒక నిశ్చయానికి వచ్చి చల్లగాలి కోసం బీచ్ కి వెళ్ళి కూర్చున్నాను. మిడిసి పడే కెరటాలతో ఆడుకుంటూ కిలకిల నవ్వుతున్న అమ్మాయిలను చూసి 'కాలేజీ పిల్లలు కాబోలు' అనుకున్నాను. జంట జంటలుగా కూర్చున్న యువతీ యువకులు అక్కడ తాము తప్ప మరెవరూ లేనట్లు కబుర్లు చెప్పుకుంటున్నారు. నాకు సుమిత్ర గుర్తు వచ్చింది. ఏ పుస్తకమో పట్టుకుని నన్ను గురించి ఆలోచిస్తూ కూర్చుని ఉంటుంది. చక్రంలో రెండు ముత్యాలు పెట్టి గలగల మనిపించుకుంటూ పకోడీలు, పిడత క్రింద పప్పు అమ్ముకుంటూ ఎవరో ముసలివాడు రావడంతో నా ఆలోచనలకి భంగం కలిగింది. 'పకోడీలు కొను, చాలా సేపు కూర్చోవచ్చు' అంటూంది ఎవరో అమ్మాయి మురిపెంగా, ప్రియునితో. ఎవరికి కావలసినవి వారు కొనుక్కుని మళ్ళీ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. అక్కడ తోడు లేకుండా కూర్చున్నది నేను ఒక్కడినే. ఒకదాని వెంట ఒకటి వచ్చి పడే తెల్లటి కెరటాలను, ఆ కెరటాల మీద పడి మిలమిల మెరిసిపోయే వెన్నెలను చూస్తూ ఎన్ని గంటలైనా గడపగలను. ఆదేదో సరిహద్దులా, అక్కడివరకూ వచ్చి ఆగిపోయే సముద్రాన్ని చూస్తే నా కెప్పుడూ చిత్రంగా ఉంటుంది. వెనక్కి వాలి ఇసుకలో పడుకొని ఆకాశం వైపు చూసేను. తమని ఎవరో ఆకాశంమీద పట్టి ఉంచినట్టు కింద పడకుండా తళతళలాడిపోయే నక్షత్రాలను చూస్తే మరీ విచిత్రంగా ఉంటుంది. మనుష్యుల కోసం ఇన్ని అందాలను సృష్టించిన భగవంతుడు అభినందనీయుడు. దూరాన ఎక్కడో గంటలు మోగుతున్నాయి. టైము చూసుకుంటే తొమ్మిదయింది. ఒంటికి అంటుకున్న ఇసుక దులుపుకుని లేచి నిలబడ్డాను. రెండు మూడు జంటలు ఇంకా కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాయి. వారి ఆనందానికి భంగం కలిగించకుండా ఉండాలని తల దించుకుని అతి నెమ్మదిగా నడుస్తున్న నాకు గలగల నవ్వులు వినిపించేయి. 'పాపం, భగ్న ప్రేమికుడు కాబోలు!' కీచుగొంతుతో అంటూంది ఆమె ఎవరో నవ్వుల మధ్య. చివ్వున వెనక్కి తిరిగేను. 'మహాతల్లీ, నేను లక్షణంగా పెండ్లి చేసుకున్నాను. నా సుమిత్ర నా కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూ ఉంటుంది' అని ఎలుగెత్తి చెప్పాలనుకున్నాను. క్షణకాలం ఆలోచించిన నాకు 'ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. వాటిని మార్చే తాపత్రయం నా కెందుకు?' అనిపించింది. ఈ సారి హుందాగా చకచక నడుచుకుంటూ రోడ్డు మీదికి వచ్చేను. హోటలు కూడు తిని తిని, ఇక తినకుండా ఆకలితోనే ఉండడం మంచిదన్న నిర్ణయానికి వచ్చేను.

"హలో! మురళీ!" పరిచిత కంఠస్వరం వినరావడంతో వెనక్కి తిరిగి చూసేను. గోపీ నన్ను కలుసుకోవాలని ఆత్రంగా పరుగువంటి నడకతో వస్తున్నాడు.

"ఈ ఊరు ఎప్పుడు వచ్చేవురా, వెధవా? వచ్చిన వాడివి నేరుగా మా ఇంటికి రాక ఈ బీచ్ రోడ్లంబడి షికార్లేమిటి?" చనువుగా తిట్టడం ప్రారంభించేడు.

వాడి ఆప్యాయతకి కళ్ళలో నీళ్ళు తిరిగేయి. చిన్నప్పుడు స్కూల్ ఫైనల్ వరకూ వాడూ, నేనూ చదువుకున్నాం. మనిషి జీవితంలో స్నేహం అనేది అమూల్య వరం. అది అందరికీ లభ్యం కాదు. అంగడిలో దొరకని వాటిలో స్నేహం ఒకటి.



"అమ్మకానికి"

చిత్రం: ఎం. బి. చారి (వరంగల్-2.)

"ఏమిటిరా, గుడిలో దేముడిలా మాట్లాడవ్? సుమిత్రకూడా ఇక్కడే ఉందా?" అన్నాడు.

"ఈ ఊరికి ట్రాన్స్ఫర్ అయిందిరా, గోపీ! ఆ ఆర్డర్సు వచ్చిన క్షణాలు ఎటువంటివో, కాని, ఇల్లు దొరికితే ఒట్టు. అందుకని జాబే వదిలేద్దాం అనిపిస్తోంది. ఇదేం ఊరురా, బాబూ! తల దాచుకునేందుకు ఒక గదైనా లేదు. సుమిత్ర అప్పుడే నాలుగు లెటర్సు వ్రాసింది విషాదంగా— వెళ్ళి రెండు నెలలవుతున్నా ఇల్లు దొరకక పోవడమేమిటని? 'ఒక్క గదైనా చాలు మన ఇద్దరికీ' అంటూ వ్రాసింది" అన్నాను నా కష్టాలు చెప్పుకుంటూ.

వాడు నవ్వేడు. "ఇల్లు దొరకడం కష్టమేరా ఈ రోజుల్లో. మేము ఉంటున్న ఇల్లు కాక, వేరే రెండు గదుల డాబా ఒకటి మాదే డాబాగార్డెన్స్ లో ఉంది. కాని రెండు సంవత్సరాల క్రితం ఒక ఆఫీసరుకి అద్దె కిచ్చాను."

వాడు వాక్యం పూర్తిచెయ్యకుండానే వాడిమీద విసుక్కున్నాను— "ఏడిచినట్టే ఉంది కబురు! అద్దె కిచ్చిన ఇంటి విషయం నా కెందుకోయ్!" అంటూ.

"అరె! పూర్తిగా చెప్పనీ! అతను 'మళ్ళీ వస్తాను, మీరు మరెవ్వరికీ ఇవ్వకండి' అని అద్దెకూడా ఇచ్చేసి తాళం మాకే ఇచ్చి ఏడాది క్రితమే వెళ్ళిపోయేడు. ఇప్పటికీ అతీ లేదు, గతీ లేదు. పోనీ లెటరూ లేదు. అతని గదిలో ఒకటో, రెండో పెట్టెలు మాత్రం ఉంటాయి. అవి ఒక మూలకి ఉంచేసి మీరు దిగిపొండి. అతను వచ్చాక చెప్పవచ్చులే" అన్నాడు.

అమాంతంగా వాడి రెండు చేతులూ పట్టుకుని, "నీ మేలు మరవలేనురా, గోపీ!" అన్నాను సంతోషంగా. కృతజ్ఞతతో నాకు మాటలు రావడం లేదు.

"చాల్లే! కథల్లోలా మాట్లాడకు. పద. ఇంటికి వెళ్ళి భోజనం చేద్దాం" అన్నాడు.

ఆ రాత్రికి వాడి ఇంట్లోనే నాకు మకాం. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ ఓ విధంగా జాగరం చేసేం.

"రంగికి ఇల్లు తెలుసురా, మురళీ! నేను టైముకి ఆఫీసుకి వెళ్ళకపోతే మా యముడు ఊరుకోడు. సాయంత్రం అటు వస్తాను. గదులూ అవీ శుభ్రం చేయించు" అన్నాడు గోపీ కాఫీ, టిఫిన్ అయేక ఆఫీసుకి వెళుతూ.

మరో గంట నీలిమాదేవితో కబుర్లు చెప్పి, "వస్తా నమ్మా! ఇల్లు చూడాలని ఒకటే ఆత్రంగా ఉంది" అన్నాను.

"మీరు డాబామీద కూర్చుంటే మా రంగి క్షణంలో శుభ్రం చేస్తుంది. మీరు శ్రమ పడనవసరం లేదు. మధ్యాహ్నం హోటలు కదీ వెళ్ళకండి. భోజనం పంపిస్తాను" అంది తాళం చెవి అందిస్తూ. ఆ దంపతుల ఆప్యాయతకి, ఆదరణకి మరొకసారి కృతజ్ఞత తెలుపుకుని, ఆఫీసుకి సెలవు పెట్టి రంగిని తీసుకుని అద్దె ఇంటికి బయలుదేరేను. ఇన్నాళ్ళకి ఇల్లు దొరికినందుకు నాకు మహదానందంగా ఉంది.

గది తాళం తీస్తూనే ఉలిక్కి పడ్డాను. 'అబ్బ! ఎన్ని కవర్లో! లేతనీలం రంగులో కళ్ళు చెదిరిపోయేలా మెరిసిపోతున్నాయి. పాపం! ఆ ఆఫీసరు ఎవరో కాని బలే దురదృష్టవంతుడు. ఆ ఉత్తరాల్లో ఏముందో, ఏమో!' నేను ఆలోచిస్తుండగానే రంగి డాబామీద కుర్చీ వేసి వచ్చింది.

"బాబూ! ఎండపొడ పడకుండా నీడలో కుర్చీ వేసేను. మీరు కూకుంటే తుడిచేసి పిలుస్తాను" అంది.

మారు మాట్లాడకుండా డాబామీదికి వెళ్ళి కూర్చున్నాను. చల్లటి గాలి వీస్తుంటే ఉత్తరాలను చూస్తూ ఎంత సేపు గడిపేనో నాకే తెలియదు. రంగి పిలిస్తే కిందకి వెళ్ళి చూసేను. ఇల్లంతా అద్దంలా ఉంది. పెట్టె తీసి బెడ్షీట్ పరిచేను మంచం మీద.

"ఆ బాబు ఎళ్ళిపోయి ఏడాదయింది, బాబూ!" అంది రంగి.

"ఆహా" అన్నాను ముభావంగా. అమ్మాయిలతో మాట్లాడాలంటే విపరీతమైన భయం నాకు.

"అమ్మగారు ఎప్పుడు వత్తారు, బాబూ?" ప్రశ్నించింది.

"ఏమో? ఇంకా తెలియదు. ఉత్తరం వ్రాయాలి. సామాన్లూ అవీ సర్దుకొని రావాలి. ఒక పది రోజులైనా పడుతుంది" అన్నాను, ఎటో చూస్తూ.

"వత్తాను, బాబూ! నిద్ర పోకండి. కేరేజీ తెత్తాను" అంటూ వెళ్ళిపోయింది.

తలుపు వేసి వచ్చి ఇంటిని పర్యవేక్షించేను. రెండు గదులు, ఒక చిన్న వంటగది, సెపరేట్ గా బాత్ రూమ్, టాయిలెట్ బాగానే ఉంది. అతడు ఒక్క గదినే వాడినట్టు కనిపిస్తోంది. మంచం కింద ఒక పెట్టె మాత్రం ఉంది. అదే కాబోలు అతని ఆస్తి. 'బ్రహ్మచారి అంతకంటే ఎక్కువెందుకులే?' నాలో నేనే నవ్వుకున్నాను. 'ఆ ఉత్తరాలేమిటి? అతడు బ్రహ్మచారి కాదేమో? రంగి నడిగితే బాగుండును' అనుకున్నాను.

'ఉత్తరాలు దిండుకింద పెట్టి పెట్టోంచి సామానులు, అద్దం, దువ్వెన తీసి టేబిల్ మీద పెట్టేను. మా పెళ్ళి ఫొటో ఒకటి అందానికి టేబిల్ మీద ఉంచేను. 'మిగతాది సుమిత్ర వచ్చేక సర్దుకుంటుందిలే' అనుకుని స్నానానికి బయలుదేరేను, నీలిమాదేవి పంపించే భోజనాన్ని ఊహించుకుంటూ. సాయంత్రం గోపీ

వచ్చినా ఉత్తరాల గురించి చెప్పాలనిపించలేదు. పిచ్చాపాటీ మాట్లాడి వాడు వెళ్ళిపోయేడు.

అతిథివని కాబోలు నీలవేణి పులిహోర, పాయసం కూడ చేసి పంపించింది. అందుకే ఏ స్త్రీని చూసినా చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకున్న కాశీ అన్నపూర్ణేశ్వరి గుర్తు వస్తుంది. తృప్తిగా తిని మంచంమీద కూర్చున్నాను. కిటికీలోంచి చల్లని వెన్నెల పడుతూంది. సుమిత్ర గుర్తు వచ్చింది. సుమిత్ర. . . నా కోసం. . . కళ్ళలో ఒత్తులు వేసుకుని ఎదురుచూసే అందాల సుమిత్ర. ఇలా ఇల్లు దొరికిందనీ, తన కోసం నే నెంత తాపత్రయపడ్డానో వివరిస్తూ ఒక అర్ధగంట సేపు ఉత్తరం వ్రాసి, 'ప్రేయసీ, ఇక నీదే ఆలస్యం. ఎప్పుడు వచ్చేదీ టెలిగ్రామ్ ఇస్తే స్టేషన్‌కి వస్తాను. నీకూ, నీ కడుపులో కదలాడే పాపాయికీ నా ముద్దులు' అంటూ ముగించి మరొకసారి చదువుకుని కవరు అంటించేసేను.

దిండు సరిగ్గా వేద్దామని తీసేను. అందమైన నీలం కవర్లు. అందులో ఏముందో, ఏమో? మనస్సు

## గీటు రాయి

**తను పతనమైనవాడే, ఆడవారి పతనం గురించి మాట్లాడతాడు. తాను ఔన్నత్యం సాధించకుండా ఆడవారి ఔన్నత్యం గురించి మాట్లాడలేరు. స్త్రీలపట్ల మనకున్న గౌరవా గౌరవాలనుబట్టి మన సంస్కారం బయటపడుతుంది.**

**—ఎ. మార్టిన్**

కొట్టుకుపోతూంది, చదవాలని. మరొకరి లెటర్సు చదవకూడదనే సభ్యత అడ్డుగోడలా నిలుస్తూంది చింపనివ్వకుండా.

అంత అందమైన కవర్లో 'ఆమె' ఏం వ్రాసి ఉంటుంది? అతను వచ్చి "నా లెటర్సు ఏవి?" అని అడిగితే? "ఏమో? నా కేం తెలుసు?" అనవచ్చు. ఒక్క లెటర్ చదివితే అతనికి వచ్చే నష్టమేముంటుంది? మిగతావి జాగ్రత్తగా ఇచ్చివేయవచ్చు. విషయం తెలుసుకుంటే చాలు. నాలోని ఆత్రం. సభ్యతని జయించింది. పోస్టల్ డేట్స్ చూసి వరసగా పేర్చేను. అట్ట అడుగున ఉన్న లెటర్ చింపేను. వణికే చేతులతో. కవరులాగే పేపరూ, దానిమీద దస్తూరీ అందంగా ఉన్నాయి. అది లెటర్‌పాడ్‌లో కాగితం. అందమైన అమ్మాయి చెంపకి చెయ్యి చేర్చి ఆలోచనా భంగిమలో ఉంది. అటువంటి లెటర్‌పాడ్ సుమిత్రకి ప్రెజెంట్ చేసేను, తన బర్త్‌డేకి. కాని, ఏ నాడూ దానిమీద వ్రాసిన పాపాన పోలేదు. "ఎందుకది?" అంటే నవ్వేసి, "మీ ప్రెజెంటేషన్ ఎన్ని సంవత్సరాలైనా, యుగాలైనా నా దగ్గర ఉంటే నాకు తృప్తి" అంటుంది అరమోడ్పు కన్నులతో. మన కిష్టమైన వారికి బహుమతి ఇవ్వడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు. అయితే, ఎదుటివారు దాని విలువను గుర్తించినప్పుడే రాణింపు ఉంటుంది. నన్నూ, నా వస్తువులనూ అమూల్యంగా చూసే సుమిత్ర నా భార్య కావడం అదృష్టమే. సుమిత్రని తలుచుకుంటూ ఆ లెటర్ చాలా సేపటి వరకూ చదవలేదు. ఎదురుగా ఉన్న అక్షరాలు ముద్దుముద్దుగా కదులుతున్నాయి. ముత్యాలు వరసగా పేర్చినట్టు ఉన్నాయి. ఆ సంబోధనే నన్ను ఆకట్టుకుంది. సుమిత్రలా 'శ్రీవారికి నమస్కారాలు' అంటూ పాత కాలంలా వ్రాయలేదు. ఆత్రంగా చదవడం మొదలుపెట్టేను.

"ప్రియమైన నీకు—

నేను క్షేమం అని వ్రాయనా? అబద్ధాలాడడం నాకు ఇష్టం ఉండదు. అబద్ధాలాడడం, మాటలతోనే కోటలు కట్టడం నీకు వెన్నతో పెట్టిన విద్య. నేను వ్రాసిన ఉత్తరాలకి 'ఇక తప్పదురా, భగవాన్' అనుకుంటూ కార్డుమీద నువ్వు వ్రాసిన అక్షరాలను చూస్తూ గడపడమే నాకు మిగిలింది. ఈ మధ్య అది కూడా కరువు చేస్తున్నావు. రాజా! ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి! ఆ రోజు. . . అంటే నువ్వు నా దగ్గర వీడ్కోలు తీసుకున్న రోజు... నేను నీకు 'శ్రీకాంత్' బహూకరించి "నన్ను మరువకు, రాజా" అని కన్నీటితో అర్థించిన రోజు. . . నీకు గుర్తు ఉండీ ఉండదు. ఆ రోజు ... అంతవరకూ మనం కలిసి నడిచివచ్చిన బాట రెండుగా చీలి మన ఇద్దరి ఎడబాటుని సూచించింది. భయవిహ్వలనై నీ వైపు చూస్తే చెక్కు చెదరని చిరునవ్వుతో నాకు ధైర్యం చెప్పేవు.

'లోకంలో ఇది సహజం, పారూ! జీవించినంత కాలం అందరూ కలిసే ఉండరు. ఇరువురి వ్యక్తుల కలయిక ఎంత సహజమో, ఎడబాటుకూడా అంతే సహజం. అయితే, కలయిక ఆనందాన్నిస్తే, ఎడబాటు భరించలేని దుఃఖాన్నిస్తుంది. పరుగులు తీసే కాలం ఏ గాయాన్నయినా మానేలా చేస్తుంది' అన్నావు చిరునవ్వుతో.

ఏమీ బాధ లేనట్టే నా దగ్గర వీడ్కోలు తీసుకునే నిన్ను చూస్తే, 'నీకు హృదయం లేదా?' అనిపించింది. రాజా! స్త్రీది ఎంత జాలి మనసు! నువ్వు కనుమరుగయేవరకు కన్నీళ్ళతో అలా చూస్తూ నిలబడ్డాను. నీ దెంత కఠిన హృదయం? ఒక్క సారి కూడా వెనక్కి తిరిగి చూడలేదు. నీ మీద విసుక్కుంటే, నా మన సేమందో తెలుసా? 'వెనక్కి తిరిగి చూస్తే నీ కన్నీటిని చూసి ముందడుగు వెయ్యలేడు. అందుకే చూడలేదు' అంది. నువ్వంటే ఎంత ఇష్టమో చూడు, ఈ మతిలేని మనసుకి. 'గతంలో ఎప్పుడో జరిగిన విషయాలు ఎందుకు వ్రాస్తుంది? పిచ్చి పారూ!' అని అనుకుంటున్నావా? ఇది చదివితే కన్నీటితో వీడ్కోల్పిన నీ పారూ కనుల ఎదుట నిలుస్తుందేమో నని ఆశ. రాజా! మెరిసే నక్షత్రాలు, పరుచుకున్న వెన్నెల, విచ్చుకుంటున్న పువ్వులు, ఆ పూల మీది హిమ బిందువులు నీ ఉనికినీ, నీతో పరిచయాన్ని ప్రతి క్షణం గుర్తు చేస్తూనే ఉంటాయి, నిన్ను క్షణ కాలం మరువాలనే నా ప్రయత్నాన్ని వమ్ముచేస్తూ. రాజా! కవిత్వం వ్రాస్తున్నానని విసుక్కోకు. నిన్ను తలుచుకుంటే నన్ను నేనే మరిచిపోతాను. నాలో భావాలు ఉవ్వెత్తున పొంగి పారలి ఏదో వ్రాయాలనిపిస్తుంది. ఎంత చెప్పినా ఏదో చెప్పాలి, చెప్పవలసింది ఇంకా ఏదో మిగిలిపోయిందనిపిస్తుంది. ఇక ఉండనా, రాజా? జవాబు వ్రాయమని కోరను. ఎందుకో తెలుసా? నేను నీ జాబుకోసం ఎంత ఎదురు చూస్తానో నీకు తెలియని విషయం కాదు. తెలిసిన విషయాలే తెలియజెప్పడం నా కలవాటు లేదు. నా రాజా! నిన్ను ఏ నాటికీ మరువలేని...

—నీ పారూ."

అంత అందంగా లెటర్ వ్రాసిన పారూ ఇంకా అందంగా ఉండి ఉంటుంది. నా ఎదుట లేని పారూని ఊహించుకుంటూ చాలా సేపు గడిపేను. 'పారూ!' అబ్బ! ఎంత అందమైన పేరు! శరత్ 'దేవదాసు' చదివిన దగ్గరినుంచి ఆ పేరంటే నాకు విపరీతమైన ఇష్టం. వినలేని ఆరాధనాభావం. మరొకసారి మరొకసారి... ఆ లెటర్ ఎన్నిసార్లు చదివేనో లెక్క లేదు. నా మనసు మళ్ళీ గోలచెయ్యడం ప్రారంభించింది, 'తరవాత ఏముయిందో తెలుసుకో!' అంటూ. 'ఇదేమయినా సినిమానా? కథా?' అనుకున్నాను, చిరాగ్గా. లైటు ఆర్పి పడుకున్నాను. చిత్రంగా పారూ నా ఎదుట నిలిచి చిరునవ్వు నవ్వుతూంది. ఉలిక్కిపడ్డాను. లేచి వెళ్ళి లైట్ వేసేను. 'టైమ్ గడిచేందుకు' అని నాలో నేనే చెప్పుకొని మరొక లెటర్ చింపేను, నాలో ఉండే సభ్యత 'తప్పు', అని గొంతు చించుకొని అరుస్తున్నా.

"ప్రియమైన నీకు—

రాజా! ఈ రోజు నువ్వు పదే పదే గుర్తు వస్తున్నావు. నా పిచ్చి కాని గుర్తు రావడానికి నిన్ను మరిచిపోతే కదూ? నువ్వు ఎక్కడ ఉన్నా నిన్ను చూసేందుకు రావాలనిపించింది. కాని? అది నాకు సాధ్యం కాదు. నీకు సాధ్యం కాని దంటూ ఏమీ ఉండి ఉండదు. ఒక్క సారి ... ఒక్క క్షణం కనిపించి వెళ్ళు. వారంరోజుల క్రితం నేను వ్రాసిన లెటర్ అందింది కదూ? అయితే, 'జవాబు వ్రాయలేదేమి?' అని అడగను లే. ఎవరినైనా నిర్బంధించి, అర్థించి మనకి కావలసింది పొందడం ఎంత నీచమో నాకు తెలుసు. మనసున ఇష్టం అనేది ఉంటే ... సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత సహజమో, ఆ ఇష్టాన్ని కాగితం మీద పెట్టాలని పించడం, ప్రియమైన వారి క్షేమాన్ని తెలుసుకోవాలనుకోవడం అంతే సహజం. అయితే నీకు నా మీద ఇష్టం లేదని నేను కలనైనా అనుకోను. ఎందుకో తెలుసా? ఆ మాట నేను భరించలేను. దేన్నయినా భరించవచ్చు కాని — మనం ఇష్టపడే వారి తిరస్కారాన్ని భరించలేం. చేదు నిజం కంటే తియ్యటి అబద్ధం ప్రాణం నిలుపు తుంది. మనసుకి ఎంతో హాయి నిస్తుంది.

'నువ్వు క్షేమమా?' అని అడగలేదు చూసేవా? అని అనుకుంటున్నావేమో? నేను నిన్ను ప్రేమించినంత కాలం నీ క్షేమానికి లోటు ఉండదని నాకు తెలుసు. కోపంతో నిన్ను ఏనాడైనా తిట్టినా, ఆ శాపం నీకు తగలదు. మనసు అట్టడుగున నువ్వంటే ఉండే విపరీతమైన అభిమానం నీకు శ్రీరామరక్షగా నిలుస్తుంది.

"బహుశా ఈవేళప్పుడు నువ్వు విశ్రాంతి తీసుకుంటూ ఉంటావేమో? ఇక వ్రాయడం ఆపేస్తాను. 'నాకై ఇది చెయ్యి' అని నిన్నెప్పుడూ అర్థించను. కాని, నీ భావి ఉజ్జ్వలం కావాలని కోరుకుంటాను. అందుకే నిన్ను నీ ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించమని మరీ మరీ కోరుతున్నాను. 'ఏమిటీ అర్థంలేని వ్రాతలు?' అని నువ్వు విసుక్కుంటుంటే చూడాలని ఉంది, రాజా! కోపంలో కూడా నువ్వు అందంగానే ఉంటావు. ఈ మాట నీకు ఎన్నోసార్లు చెప్పేను కదూ? అలా అన్నప్పుడు అందంగా ఉండే నీ అధరాల మీద చిరునవ్వు మెరుస్తుంది. ఆ చిరునవ్వుని చూస్తూ ఎన్ని యుగాలైనా గడపగలను. నీ చిరునవ్వు నాదీ కావాలనుకోవడం దురాశ కాదేమో? నా ఈ ఉత్తరాన్ని అతి శ్రద్ధగా, ఇష్టంగా, ప్రేమగా చదువుతా వనుకుంటే నాకు

తృప్తి. చెప్పానుగా—అబద్ధం తీయగా ఉంటుందని? నా రాజా, ఇక ఉండనా? మంచి ముత్యాల వంటి హిమబిందువులను చూస్తుంటే కాగితం మీద నీ అక్షరాలు గుర్తు వస్తున్నాయి. కనీసం నీ అక్షరాలను చూడాలనుకోవడం తీరని కోరిక కాదేమో! 'నా పారూ!' అని నువ్వు వ్రాసే అక్షరాలని చూడాలని నా కనులు ఆత్రపడుతున్నాయి. ఎప్పటికీ...నీ పారూ."

పారూ మరొకసారి నా కనుల ముందు నిలిచి మధురంగా నవ్వింది, వెన్నెలలు విరిసినట్టు, విరజాజులు నేల గుమ్మరించినట్టు. ఈ రాజాకి ఎంత బుద్ధిలేదు! మారిన అడ్రెస్ పారూకి ఇవ్వవద్దూ? లేకపోతే రీ డైరెక్టు చెయ్యమని ఎవరికైనా చెప్పవచ్చుగా? అసలు ఈ రాజాకి మొండెంమీద తలకాయ ఉందా?' అని నా ఎదుట లేని రాజాని కసిదీరా తిట్టేను. ఆలోచించకుండానే ఈ సారి ఉత్తరం చింపేను. ఎందుకంటే, తప్పు ఒకసారి చేసినా, పది సార్లు చేసినా ఒకటే. శిక్షకి రెండు శిక్షలు ఉండవు. పారూ మరొకసారి కనిపించి మాయమయింది.

"ప్రియమైన నీకు,

రెండు వారాలు దాటుతూంది నీకు ఉత్తరం వ్రాసి. పురాణకాలంలోలా ఎవరో బాణం వేసేరో ఏమో? ఆకాశం చిల్లుబడి ఘోరున వర్షం కురుస్తూంది. గదిలో కూర్చుని వర్షం చూస్తూంటే చటుక్కున నువ్వు ఏం చేస్తూ ఉంటావో ఊహించాలనిపించింది. రాజా! ఆ రోజు నా కింకా గుర్తే. ఈ రోజు లాగే వర్షం పడుతుంటే నేను కాగితం పడవలు చేస్తుంటే నువ్వు నీట్లో వేస్తున్నావు— నీకు గుర్తు వచ్చిందా? 'ఇష్టం అంటే ఇదే సుమా?' అన్నట్టు మాట్లాడేవు. అందుకే నువ్వంటే అంత ఆకర్షణ; చెప్పలేని ఇష్టం.

చిత్రం ఏమిటంటే — నీకు కోపం ఎప్పుడు వస్తుందో తెలియదు. మనం కలిసి నడిచిన బాటలో వెనక్కి తిరిగి చూస్తే మనం స్నేహపూర్వకంగా ఉండే క్షణాల కంటే, విరోధంగా ఉండే కాలమే ఎక్కువ. అయినా, ఆ కొద్ది నిమిషాల స్నేహమూ నన్ను నేను మరిచేలా చేస్తుంది. 'నీవు లేని నేను ఉండలేను' అనుకునేలా చేస్తుంది. కాని మన ఎడబాటు తప్పనిసరి చేసేవు. రాజా! తామరాకు మీది నీటి బొట్టు వంటి వాడివి నువ్వు. నీ చుట్టూ ఆశలు అల్లుకొని, కన్నీరు కార్చే వాళ్లని చూసి చిరునవ్వు నవ్వుతావేమో? రాజా! మనిషికి ఏదో ఒక ప్రత్యేకత ఉండి తీరాలి. శిల వంటి మనసు ఉండడమే నీ ప్రత్యేకత. మాటలతో నిన్ను కించపరచడం నా అభిమతం కాదు. నీ క్షేమాన్ని తెలుసుకోవాలనే ఆకాంక్షే నా చేత ఇలా వ్రాయిస్తూంది. నన్ను క్షమించు. ఇక మరేమీ వ్రాసే ఓపిక లేదు. 'ఇక చాలు వ్రాసింది' అన్నట్టు పెన్నులో ఇంక్ కూడా అయిపోయింది. ఇక ఉండనా, రాజా?

—నీ పారూ."

ఈ రాజా ఎంత ఫూల్! పారూతో దేనికో దానికి పోట్లాడే వాడన్న మాట. అందాల పారూ మీద కోపం ఎందుకు? పారూ అన్నట్టు వీడి హృదయం రాతితో చేసి ఉంటాడు బ్రహ్మ. రాజాగాడు కనిపిస్తే ముక్కలు ముక్కలుగా నరికి పారేయాలి. పారూ ఎదుట ప్రత్యక్షమయింది. ఛ! నే నెంత బుద్ధిలేని వాణ్ణి! పారూకి ఇష్టమైన రాజాని ఏమైనా చేస్తే పారూ భరించగలదా? 'నన్ను క్షమించు, పారూ!' అనుకున్నాను.

మరొక కవరు చింపేను. మొదటి తప్పు చేసినప్పుడే మనసు మందలిస్తుంది. చేతులు వణుకుతాయి. ఆ తరవాత అది అలవాటయిపోతుంది.

"ప్రియమైన రాజా!

ఆకాశం మీద చంద్రుడు పాల గిన్నె క్రింద పార వేసుకున్నాడు కాబోలు, ఆ పాలు భూమి మీద ఒలికి వెన్నెలగా మారిపోయింది. ప్రతి పువ్వు, ప్రతి చెట్టు వెన్నెట్లో తడిసి మిలమిలా మెరిసిపోతున్నాయి. నీకు నేను ఉత్తరం వ్రాసి పక్షం రోజు లయిందన్న మాట. చిక్కని వెన్నెట్లో చాపేసుకు కూర్చుంటే నండూరి వారి ఎంకి గుర్తు వచ్చింది. 'నా వెనక ఎవరో నవ్విన ట్టున్నాది' అనుకున్నాను నాలో నేను. రాజా! నాకు నీ చిరునవ్వే గుర్తు వస్తూంది వెన్నెల చూస్తూంటే. 'బహు దూరపు బాటసారీ! ఇటు రావో! ఒక్కసారీ!' అని పాడుకోవా లనిపిస్తూంది. ఇక్కడ నేను పాడుకున్నా, నీ కోసం కన్నీరు కార్చినా నీకు వినిపించదు; కనిపించదు. రాజా! నిన్ను విసిగిస్తున్నానా? నా మనసులో మాట నీకు చెప్పాలనీ, నువ్వు చెప్పేవి వినాలనీ ఎంతగా కోరుకుంటున్నానో! నీవు నీ మనసులో మాట చెప్పక పోయినా నన్ను చెప్పనీ, రాజా! ఎప్పుడూ అనుకుంటాను— మనసు చింపితే చిరిగిపోయే కాగితం కాకూడదు, క్రింద పడితే పగిలే గాజు బొమ్మ కాకూడదు' — అని. అలా అనుకోవడమే మిగులుతూంది నాకు. చిన్నప్పుడు మిణుకు మిణుకు మనే నక్షత్రాలను మాలగా కూర్చి మెడలో వేసుకోవాలనుకునేదాన్ని. ఇప్పుడు తలుచుకుంటే హాస్యాస్పదంగా ఉంటుంది. నీ అంత గొప్ప వ్యక్తిని నేను కోరడం అనుచితమే ఏమో, రాజా? నేనంటే నీ కెంత ఇష్టమో నాకు తెలుసు. నన్ను చూడగానే మెరిసే నీ కళ్లు నీ ఇష్టాన్ని దాచలేవు. కాని, 'పారూ! నువ్వంటే నా కిష్టం' అని నువ్వు చెబుతుంటే వినాలని ఉంది. నీ కళ్లు నిద్రతో వాలిపోతున్నాయేమో? ఇక ఆపనా ఈ అర్థంలేని వ్రాతలు? పిలిచినా పలుకని దేవునికి ఎన్ని విధాల నివేదించుకున్నా లాభం లేదు. అయినా, నా తృప్తికోసం వ్రాస్తాను— అంతే!

—ఎప్పటికీ నీదైన నీ పారూ."

'అబ్బ! ఈ పారూకి సిగ్గు అయినా లేదేమిటి? ఒక్కదానికి జవాబు వ్రాయకపోయినా ఎంత ఓపికగా వ్రాస్తూందో! ఆడవాళ్లకి ఆత్మాభిమానం ఎక్కువంటారు. ఈ పిల్లకి అటువంటి దేమీ లేదు కాబోలు!' అనుకున్నాను. మిగిలినవీ అలాగే ఉంటాయి. ఇక చదవడ మెందుకు? అని కాసేపు కళ్లు మూసుకున్నాను. ఆ తరవాత ఏమయిందో? పారూ ఎవరినైనా పెళ్లి చేసుకుందా? చేసుకునే ముందు రాజాకి ఉత్తరం వ్రాసి ఉంటుంది— అనుకుంటూ విషయం సమగ్రంగా తెలుసుకోవాలని మరొక లెటర్ చింపేను.

"ప్రియమైన రాజాకి,

ఈ రోజుకి రెండు నెలలయింది కదూ నీకు నేను లెటర్ వ్రాసి? ఈ రోజు మళ్లీ అదే ఆకాశం. అదే వెన్నెల. ఒక రోజు నువ్వూ, నేనూ వాహ్యాళికి వెళ్లేం. నీకు గుర్తుందా? నల్లటి రోడ్డు మీద తెల్లని వెన్నెల పరుచుకొని 'అందమంటే ఇదే' అని తెలియజెప్పుతూ ఉంది. నీతో అలా మౌనంగా నడవడం నా కెంతో ఇష్టం. అలా నడుస్తూ, 'ఏ దూర తీరాలకో మరెవరూ లేని స్థలానికి సాగిపోతే? ! నడిచే ఈ బాటకి గమ్యం లేకుండా ఉంటే ఎంత బాగుండునో!' అన్నావు నువ్వు. భావాలు తెలుపలేని మూగనై నీ ముందు మోకరిల్లిన క్షణాలు శాశ్వతమయితే? నీ కనిపించలేదూ ఈ కాలం ఇలా నిలిచిపోతే బాగుండునని! కాలం ఆగదు, రాజా! నిజం ఎంత చేదుగా ఉంటుందో? నువ్వూ, నేనూ కలిసి నడిచే దూరం తరిగిపోయింది. నాకు తెలుసు— ఒకానొక నిశ్శబ్ద నీరవ నిశీథిలో నీ దగ్గర వీడ్కోలు తీసుకోవాలని. మనం ఇద్దరం కలిసి చూసిన ఈ నక్షత్రాలు, వెన్నెల ఎప్పటికీ ఉంటాయి. కాని, నాకుమాత్రం నిన్ను గుర్తు తెచ్చే ఈ వెన్నెల అంటే చెప్పలేని విసుగు, రాజా! నువ్వూ మామూలు మనిషివే అంటుంది ఈ లోకం. కాని, నువ్వు నాకు దేవుడివి. నీకూ ఈర్ష్యాసూయలు, రాగద్వేషాలు ఉంటాయనుకోను. నీ సాన్నిధ్యం ఒక అపురూపమైన వరం. నేను మారిపోతున్నానట. అవును. నీ ధ్యాసలో దేవుని తలించేందుకు కూడా టైము లేదు. మనసు లగ్నం చేసే శక్తి లేదు. ఒక్కటి చెప్పనా, రాజా? సూర్యుడు లేకుండా పద్మం వికసించదు. కాని, పద్మం లేకపోయినా సూర్యుడు ప్రకాశించగలడు. అలాగే, రాజా! నువ్వు నేను లేకపోయినా ఉండగలవు. నువ్వు లేని నేను లేను అనిపిస్తుంది. నేను ఈ లోకంలో లేనని తెలిసిన రోజు కూడా నువ్వు చిరునవ్వు నవ్వగల వనుకుంటే జవాబు వ్రాయకు? కఠినంగా వ్రాసేనేమో కదూ? ఎంత కఠినంగా వ్రాసినా అది నీ మనసుకి తాకదుగా! ఈ రోజు నాకే నిద్రవస్తూంది. ఇక ఉంటాను, రాజా. ప్రేమతో...

—పారూ."

## ఎంత తేడా!

**అవతలి వ్యక్తి మన అభిమతానికి అనుగుణంగా మాట్లాడితే, అతన్ని గొప్పవాడంటాం. అతనే మనకు అంగీకారం కాని మాట చెబితే, చవట అంటాం. పుస్తకాలు చదివేటప్పుడు ఇలాటి విచిత్ర అనుభూతులు కలుగుతూంటాయి.**

—స్విఫ్ట్

అరె! పారూకి కూడా కోపం వస్తూందే! నాలో నేనే నవ్వుకొని మరొక లెటర్ చింపేను.

"ప్రియమైన రాజాకి,

దేన్నయినా తెగేవరకూ లాగ కూడదుట. ఆడదానికి ఆత్మాభిమానం ఎక్కువ. దానిని విడిచి కూడా నీకు విడవకుండా లెటర్లు వ్రాస్తున్నానంటే, అది నీ మీద ఉండే అభిమానమూ, ఆరాధనా మాత్రమే. సహనానికి, ఇష్టానికి కూడా హద్దు లుంటాయి, రాజా! మనసు అద్దం వంటిది. చేజారి క్రింద పడితే పగిలి ముక్కలయి పోతుంది. అందులో ప్రతిబింబం చూసుకోవాలను కుంటే చెదిరిన రూపం మాత్రమే కనిపిస్తుంది. నువ్వు నన్ను ఎంత నిర్లక్ష్యం పరిచినా నీతో గడిపిన క్షణాలు చాలు, నిన్ను మరువకుండా ఉండేందుకు. నిన్నేమన కూడదని ఎంతగా అనుకున్నా మాట జారవిడి వస్తూంది. నన్ను క్షమించు, రాజా!

ఈ రోజు అలా కళ్లు మూసుకున్నాను, నిద్ర పోదామని, ఎంత అదృష్టమో. నువ్వు కలలో కనిపించేవు. అంతదూరం నుంచి నా కోసం నడిచి వచ్చిన నీకు ఏవేవో సేవలు చెయ్యాలని ఎంత ఆత్రపడ్డానో! 'నను పాలింపగ నడచీ వచ్చితివో!' అని నవ్వుగా పాడు

కుంటూ కాఫీ చేస్తుంటే చిరునవ్వుతో చూస్తూ కూర్చున్నావు. రెప్ప లార్పకుండా నిన్ను చూడాలనుకుంటే టక్కులాడి చుక్కలు పక్కుమన్నాయి. వల్లమాలిన సిగ్గు నీకూ, నాకూ మధ్యగా సిగ్గు తెరలు జార్చింది. ఏటి ఒడ్డున కూర్చుని నీటిలో నీడలు చూసుకుందా మంటే చేప పిల్లలు బయటికి వచ్చి చిలిపిగా చూసేయి. నువ్వు అలా రెప్పవెయ్యకుండా చూస్తూనే ఉన్నావు. మాట్లాడాలని పెదవి విప్పేనో, లేదో పందిరి మీద సన్నజాజులు జలజల రాలి, 'మే మున్నాము సుమా!' అన్నట్లు నవ్వేయి. దీపారాధనకి వేళయిందని గుడిలో గంటలు గణగణ మ్రోగేయి. 'ఇక నీతో మనసు విప్పి మాట్లాడే దెప్పుడు, రాజా!' అని బేలగా చూస్తే పకపక నవ్వేవు. పాల వెన్నెలలో కూర్చుని ఎన్నెన్నో కబుర్లు చెప్పేవు. నన్ను నేనే మరిచి కరిగి నీరై నీ పాదాలను కడిగేను. రాజా! పిల్లి పాలు క్రింద పడేసింది. ఆ చప్పుడుకి మెలుకువ వచ్చి కనులు తెరిస్తే నువ్వూ లేవు; మిడిసిపడే సముద్ర కెరటాలూ లేవు. నేల ఒలికిన పాలు చూస్తుంటే నా బ్రతుకు కూడా అంతేనేమో? అనిపించింది.

అలిగి, మాట్లాడకుండా నిన్ను ఎన్నోసార్లు విసిగించేను కదూ? అది నీ మీద కోపంతో కాదు. నీ సాన్నిధ్యంలో సదా నిలవాలనే. ఆ విషయం నీకూ తెలుసు. నువ్వూ, నేనూ ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా నీదే అధికారం. ఒక విధంగా నన్ను నేను నీకు సమర్పించుకున్నాను. నీ ఎదుట నేను చెప్పాలనుకున్నది చెప్పలేను. నిజానికి నువ్వు చెప్పేది వినడమే నా కిష్టం, రాజా! నేనంటే నీ కెంత ఇష్టమో నాకు తెలుసు. కాని నా మూర్ఖత్వాన్ని భరించడం కష్టం కదూ? మనం కలిసి చెప్పుకునేవి వినాలని మన స్నేహితులు ఎవరు వచ్చినా నా కిష్టం ఉండదు. అయితే, నువ్వు ఎవరితోనైనా స్నేహం చెయ్యగలవు. అది నీ స్వభావం. కాని, రాజా, వాళ్లు నాలా నిన్ను హృదయపూర్వకంగా ప్రేమించలేరు. మిణుగురు పురుగులని కూడా నక్షత్రాలలా చూసే నీ మనస్తత్వం నాకు అర్థంకాదు. రాజా! నువ్వు ఈర్ష్య అను, అసూయ అను—ఏమైనా అనుకో! కాని, నీ ప్రాణ స్నేహితులని నువ్వు మురిసిపోతున్న వాళ్లతో ఉండి నన్ను అలక్ష్యం చెయ్యడం నేను సహించలేను, రాజా! నాకు నువ్వు, నీకు నేను మాత్రమే ఉండాలనే కోరికే నీతో పోట్లాడేలా చేసేది. అది నువ్వు గ్రహిస్తే చాలు. అంతకంటే మరేం కోరుకోను. ఇక మరేమీ వ్రాయాలని లేదు. నీకు ఇక లెటర్సు వ్రాయలేక పోవచ్చు. అప్పుడు ... అప్పుడు .... నీకు నేను గుర్తుంటానా, రాజా?

—ఎప్పటికీ నీ పారూ."

ఆదీ సంగతి. ఏదో చిక్కు ముడి విడిపోయినట్లయింది. రాజుకి వేరే స్నేహా లున్నాయన్న మాట. పారూ భరించలేక గట్టిగా అడిగితే ఈ ప్రబుద్ధుడికి కోపం వచ్చిందన్న మాట. అలాంటి పారూ ఉండగా వేరే స్నేహా లెందుకూ? వాడు ఎక్కడున్నా తీసుకువచ్చి నాలుగు తన్నాలనిపించింది. పారూ మళ్లీ ప్రత్యక్షమయింది నా కనుల ఎదుట. 'పారూ! నువ్వు నాకు అనుమతి ఇయ్యి. రాజా ఈ ప్రపంచంలో ఏ మూల దాగినా నీ పాదాల ముందు తెచ్చి పారేస్తాను' అన్నాను. నా ఎదుట నిలిచిన పారూ నవ్వింది—అందంగా, ముగ్ధమనోహరంగా. ఇక రెండు లెటర్సు మిగిలేయి. దాహం అనిపిస్తే లేచి వెళ్లి కూజాలో నీళ్లు గ్లాసులో ఒంపుకొని తాగేను. వెన్నెల మంచం మీద పడి మెరిసిపోతూంది. నాకు సుమిత్ర గుర్తు వచ్చింది. తీరుబడిగా కూర్చుని పారూ లెటర్ చింపేను.

"ప్రియమైన రాజా!

రేడియో ట్యూన్ చేసి వచ్చి కూర్చుంటే నీకూ, నాకూ ఇష్టమైన పాట 'చావు పుటుక లేనిదమ్మ నేస్తమన్నది, జనమ జనమ కది మరీ గట్టిపడతదీ!' అంటూ వస్తూంది. నిజమంటావా, రాజా? ఈ జన్మలోనే శాశ్వతంగా నిలవని స్నేహాలు జన్మ జన్మల అనుబంధాలవుతాయా? కథలలోనూ, సినిమాలలోనూ మాత్రమే ఈ అనుబంధాలు, స్నేహాలు నిలిచి ఉంటాయేమో? ఏదో వ్రాయాలని మరేదో వ్రాస్తున్నాను.

ఈ రోజు నా పుట్టిన రోజు కదూ? 'కదూ?' ఏమిటి నా ముఖం, అదేదో నీకు కూడా తెలిసినట్లు వ్రాయడ మేమిటి తెలివి తక్కువ కాకపోతే? ఇన్నాళ్ల నీ నిర్లక్ష్యాన్ని మరిచిపోయి, ఈ రోజు నీ కోసం వెయ్యికళ్లతో ఎదురుచూసేను. నీకు ఇష్టమయిన తెల్ల జరీ చీరె కట్టుకుని, సన్నజాజులు పెట్టుకొని, ముత్యాల హారం, ముత్యాల కమ్మలతో నీకు నచ్చే విధంగా తయారై అద్దంలో చూసుకుంటే నాకు నేనే కొత్తగా కనిపించేను. ఆకుల గలగల మంటే నీ అడుగుల చప్పుడే అనుకున్నాను. పొద్దుమధ్యాన్నం వరకూ చూసేక, ఏ పనిలో నిమగ్నమై ఉన్నావో రాలేక పోయేవనుకున్నాను. కనీసం అభినందనలు పంపించాలనే ధ్యాస లేనంతగా నన్ను మరిచిపోయే వనుకోలేదు. 'నన్ను గుర్తుంచుకో, రాజా!' అని అర్థించను. కాని, నేను నీకోసం చేసి ఉంచిన పూతరేకులు, పాలకోవా ఏం చేసుకోను? చాలా రోజులకి నీ ఫొటో పెట్టెలోంచి తీసి చూసేను. నీ నగుమోము చూస్తుంటే ఏవేవో జ్ఞాపకాలు కలవరపరుస్తున్నాయి. నువ్వు నవ్వితే ముత్యాలు నేల రాలిన ట్లుంటుంది. నువ్వు నడిచిన బాటలో గులాబీలు పూస్తాయి. రాజా! నీ అధరాల మీది చిరునవ్వుని నేనవనా? నీ కన్నులలోని వెలుగుని నే నవనా! నీ సాన్నిధ్యంలో సదా నిలిచిపోయే భాగ్యంకోసం నే నేమయినా అవుతాను. మనసుని వీణ చేసి మ్రోగించనా? కవితా ధారనై నీపై వర్షించనా! జగత్తులోని అణువణువులో నువ్వుంటావు. ఆ అణువుల్లో ఒక అణువుని కానా? రాజా! మాటలు మరిచి నీ కనులలో నన్ను నేను చూసుకునే దెప్పుడు? నీకై నిరీక్షించే ఈ లేగులాబీని వాడిపోకుండానే స్వీకరించు. దానికి ప్రతిగా నిన్ను కోరేది ఒక్కటే కలలో కనిపించిన నీవు, నా కనులలో బందీగా నిలిచిపో. ఇలా దూరంగా ఉండి మురిపిస్తావెందుకు? నీ సాన్నిధ్యంలో ఉండే మహిమ ఎటువంటిదో, నిన్ను చూస్తూ ఈ లోకాన్నే జయిస్తాను. ఎన్నాళ్లయిందో నిన్ను చూసి! ఒక్కసారి కనిపించి వెళ్లు, రాజా! నీకోసం ఎదురు చూడనా?

—నీకై నిరీక్షించే నీ పారూ."

త్వరత్వరగా

చిత్రం—వి. తారారావు



ఇక ఒక్క లెటరే మిగిలింది. అందులో ఏం వ్రాసిందో ఏమో? చాలా సేపు ఊహిస్తూ కూర్చున్నాను. అసలు వాళ్లిద్దరూ ఎలా ఉంటారు? పారూ ప్రబంధ నాయికలా ఉంటుంది, సందేహం లేదు. రాజా ఎలా ఉంటాడో? అందంగానే ఉండి ఉంటాడు. లేకపోతే అంత అందమైన పారూ ఎందుకు ప్రేమిస్తుంది? ఏమో? ప్రేమ గుడ్డిది. రాజా అందగాడంటే నా మనస్సు ఒప్పుకోవడం లేదు. చివరికి మిగిలిన ఉత్తరాన్ని అపురూపంగా చింపేను.

"ప్రియమైన రాజా!

నువ్వు వస్తావని చాలా రోజులు ఎదురు చూసేను. నువ్వు రాలేదు. నీ తలపులే మిగిలేయి నాకు. నిన్ను తలచి తలచి అలిసిన మనసుతో క్షణకాలం కళ్లు మూసేను. ఊహూఁ నిద్ర రావడం లేదు. చీకటి వెలుగుల కలయిక. చిత్రమైన రంగులతో సంధ్య మెరిసిపోతూంది. పక్షులు ఒక్కటొక్కటిగా గూళ్లకి చేరుకుంటున్నాయి. దూరాన నిలిచిన కొబ్బరిచెట్లు నా లాగే తిరిగే కాలచక్రాన్ని చూస్తున్నాయి, మౌనంగా. సూర్యుడు పడమట అస్తమించే వేళ, ఆకాశం నుదుటను సింధూరం దిద్దుకునే వేళ నువ్వు తప్పక గుర్తు వస్తావు. ప్రకృతిని చూసి ఇంకా ఆనందించగలిగే శక్తి ఉందా ఈ పారూకి అని ఆశ్చర్యంగా ఉందా? ఏ ఇసుక రేణువులోనైనా నువ్వు కనిపిస్తావేమో అని కళ్లు విప్పార్చి చూస్తాను. పగలు వెనకే రాత్రి, రాత్రి వెనకే పగలు. ప్రకృతిలో ఏ మార్పూ లేదు. ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తుంటే మృత్యువుని సమీపిస్తున్నాం అనుకుంటే ఒళ్లు ఝల్లుమంటూంది—ఈ బంధాలన్నీ వదిలిపోవాలంటే. ఈ నిశ్శబ్ద వాతావరణ

జంలో ఈ ఒంటరితనాన్ని భరించలేను. 'నీకేం, పారూ! ఊర్లో అందరూ నీకు ఆత్మ బంధువులే. నిన్ను చెల్లెలితో సమానంగా చూసుకుంటారు ప్రతి ఒక్కరూ!' అంటావు నువ్వు. కాని, రాజా! ఎంతమంది ఉన్నా నేను నీ కోసమే బ్రతుకుతున్నాను. ఏకాగ్రతతో నీకై తపస్సు చేసే శక్తి పోతూంది. నిన్ను చూడగలననే ఆశ రోజురోజుకీ హరించిపోతూంది. మన మధ్య ఉండే ఈ దూరం తరిగే దెప్పుడో? సర్వస్వం మరిచి నీ ఒడిలో నిద్రపోయే దెప్పుడో? అప్పుడు... అప్పుడు... దేనికో దానికి అలిగి కోపం తెచ్చుకుని మాట్లాడడం మానెయ్యవు కదూ?

ఎప్పటికో అప్పటికి నీ సాన్నిధ్యంలో నన్ను నేను అర్పించుకునే క్షణం తప్పక వస్తుందని నాకు తెలుసు. మనుష్యులంటే నీకు ఎంత నిర్లక్ష్యమో కూడా తెలుసు. క్షణికాల ఆవేశంతో మన అనుబంధాన్ని తెంపివేసే చిత్రవధ చెయ్యకు. నిన్ను నేను ఎంతయినా ఇష్టపడవచ్చు కాని, నిర్లక్ష్యాన్ని, అవమానాన్ని భరించలేను. రాజా! ఇదే నా ఆఖరి లెటర్ కావచ్చు. ఇంతకాలం నిన్ను నా లెటర్స్‌తో ఎంత విసిగించేనో తలుచుకుంటే నాకే సిగ్గుగా ఉంది. నీకోసం ఎదురుచూడడం కంటే మరేం చేయగలను? అదేనా మరి కొంతకాలం వరకే. ఆ తరవాత... నా ఊహకి అందడం లేదు. నువ్వు ఊహించగలిగితే ఊహించు.

నా రాజా! ఏమేమో వ్రాయాలనీ, ఏమేమో చెప్పాలనీ ఉంది. ఎంత చెప్పినా, ఇంకా ఏదో చెప్పవలసింది మిగిలిపోయిం దనిపిస్తూంది. నేనేం చెప్పినా, నువ్వూ, నీ అపురూపమైన స్నేహం కావాలనే. అంతకంటే మరేం చెప్పగలను? 'నా కోసం ఎదురుచూడు, పారూ! ఏనాటికైనా వచ్చి నిన్ను నా దానిగా చేసుకుంటాను' అని ఒక్క మాట అను, రాజా! ఎంతకాలమైనా నీకై నిరీక్షిస్తాను. ఇక ఉంటాను, రాజా!

—నీ పారూ."

'పారూ! పారూ!' నా హృదయం బాధగా మూలిగింది. నిరాశతో ఇక వ్రాయడం మానుకుంది కాబోలు పిచ్చి పారూ! ఆ లెటర్ సరిగా ఆరు నెలల క్రితం వ్రాసింది. రాజా ఇక్కడి నుంచి వెళ్లిపోయి ఏడాదయింది. అందుకే లెటర్సు చూసుకోలేదు. ఆ తరవాత ఏం జరిగిందో తెలుసుకోవాలనే ఉత్కంఠ నన్ను నిలవనివ్వడం లేదు. పిచ్చివాడిలా గదిలో అటు ఇటు తిరుగుతున్న నాకు చటుక్కున మెరుపు వంటి ఆలోచన వచ్చింది. నన్ను నేనే అభినందించుకున్నాను. మంచం క్రింద ఉన్న రాజా పెట్టె బయటికి లాగేను. ఆ సమయంలో అది నాకు దొంగతనం అనిపించలేదు. పెట్టె బరువుగానే ఉంది. ఏముందో ఏమో? నా అదృష్టం! పెట్టెకి తాళం లేదు. బహుశా దగ్గిర, దగ్గిర రెండు సంవత్సరా లయిందేమో అది తెరిచి? మూత తెరిచేందుకు కొంచెం కష్టపడవలసి వచ్చింది. పెట్టె నిండా పుస్తకాలే. అందమైన అట్టలతో నీటుగా ఉన్నాయి. ఒక పుస్తకం తీసి చూసేను. శరత్ 'శ్రీకాంత్'. మొదటి పేజీలోనే ముద్దొచ్చే అక్షరాలతో పారూ వ్రాత కనిపించింది.

"ప్రియమైన రాజాకి,

జ్ఞాపకాల తెరల మాటున మరుగుపడకుండా క్షణకాలం సాన్నిహిత్యంతో నిలిచేందుకు నన్ను నేనే సమర్పించుకునే ఈ మధుర క్షణం శాశ్వతం కావాలని మనసారా కోరుకుంటూ...

—ప్రేమతో పారూ!"

ఎంత అమూల్యమైన కానుక! 'శ్రీకాంత్'లో రాజ్యలక్ష్మి లాగే పారూ కూడా రాజాని ఆరాధించింది. నా కళ్లు చెమ్మగిల్లేయి. పుస్తకాలన్నీ తిరగేసి చూసేను. చాలావరకూ శరత్‌బాబువే. ఠాగూర్‌వి, పండిట్జీవి కొన్ని ఉన్నాయి. రాజా సాహిత్యాభిలాషి అని అభినందించకుండా ఉండలేకపోయేను. పుస్తకాల అట్ట అడుగున నాకు కావలసింది దొరికింది. ఎగిరి గంతేసినంత పని చేసేను. అది రాజా వ్రాసుకున్న డైరీ! పుస్తకాలన్నీ ఎక్కడి వక్కడ సర్దేసి తీరుబడిగా మంచం మీద కూర్చుని డైరీ తిరగేసేను. అంది రెండు సంవత్సరముల క్రిందటిది. అందుకే రాజా ఇక్కడ వదిలి వెళ్లేడు. చాలావరకు పారూ, అతనూ కలిసి తిరిగిన సంఘటనే వ్రాసుకున్నాడు. పారూ అంటే రాజాకి ప్రాణం. ఒక పేజీ దగ్గర ఆగిపోయేను.

18:— పారూతో పోట్లాడి ఇంటికి వచ్చేను. తనతో తప్ప మరెవరితో మాట్లాడకూడ దంటుంది. నా మీద అంత నమ్మకం లేనప్పుడు ఇక స్నేహం ఎందుకు? స్నేహానికి నమ్మకం పునాది వంటిది. ఏమైనా అంటే ఏడుస్తుంది. పెళ్లి అయేక కూడా ఇలాగే ఏడుస్తుంది కాబోలు. బయట ఎన్నో కష్టా లనుభవించే మగవాడికి భార్య ఇచ్చే చల్లని ఓదార్పు, తీయని చిరునవ్వు ఎంతయినా అవసరం. గృహ కలహాల వల్ల మిగిలేది అశాంతి మాత్రమే.

19:— పారూని కలుసుకోలేదు. నా కోసం ఎదురు చూస్తుందని తెలుసు. పారూ గురించి ఆలోచిస్తూ ఉంటే వదిన గదిలోంచి ఏడుపు వినిపించింది. విస్తుపోయేను. గబగబ వెళ్లి తలుపు తట్టేను. చాలాసేపటికి వదిన తలుపు తెరిచింది. 'ఏం కావాలి, రాజా?' అంది విస్మయంగా. ఏం చెప్పాలో తెలియలేదు. వదిన ఏడ్చినట్టు ఆమె కళ్లే చెబుతున్నాయి. కాని, ఎలా అడగాలో తెలియలేదు. 'ఏం లేదు, వాచ్ ఆగిపోయింది టైమ్ చెపుతా వేమో నని' అన్నాను. వదిన కూడా ఏడుస్తుందా? అంతా అయోమయంగా ఉంది.

20:— ఈ రోజున కూడా పారూని కలవలేదు. అందుకే ఇంటికి తొందరగా వచ్చేను. మనసుని అదుపులో ఉంచుకునేందుకు 'గీతాంజలి' చదువుతూ కూర్చున్నాను. వదిన గదిలోంచి ఏడుపు. 'నా కెందుకు?' అని ఊరుకున్నాను. వదిన డాక్టర్. మనిషి కోరుకున్నవన్నీ వదిన కున్నాయి. వడ్డించిన విస్తరి వంటిది వదిన జీవితం. స్త్రీ అన్నీ ఉన్నా దుఃఖించిందంటే అదేదో ప్రేమ వ్యవహారమే. వదిన మరెవరినైనా ప్రేమించిందా?

21:— పారూ ఉత్తరం వ్రాసింది—ఈ తప్పు క్షమించమని. పిచ్చిపిల్ల! వదిన నవ్వింది ఉన్న ఊర్లోనే ఉత్తరా లేమిటని! అన్నయ్య, వదిన పిక్చర్‌కి వెళ్లేరు. ఇంట్లో ఒక్కడిని! వదిన గదిలో రేడియో పెట్టుకున్నాను. టేబిల్ తియ్యగానే కనిపించింది వదిన డైరీ. చేతులు వణికేయి ఇటు అటు తిప్పుతుంటే. వదిన ఏడుపుకి కారణం తెలుసుకోవచ్చు. వద్దనుకుంటూనే చదివేను. అన్నయ్యకి 'ఎజోస్పెర్మియా' అట. అదేం జబ్బు? వదిన ఏడ్చిందంటే ఆదేదో పెద్ద జబ్బే అయి ఉండాలి. రేపు వైజాగ్ వెళ్లి ప్రభుని అడగాలి.

22:— ప్రభు మాటలు వింటుంటే నా తల తిరిగిపోయింది. అన్నయ్యకి ఇక పిల్లలు పుట్టరట. ప్రభు చెప్పేడు. స్త్రీ దేన్నయినా భరిస్తుందట. కాని, ఈ విషయాన్ని భరించలేదట. మెరుపు వంటి ఆలోచన వచ్చి నేను టెస్టు చేయించుకున్నాను. ఏది ఏమైనా నిష్కళంకంగా చెప్పమని కోరేను. పారూకి అన్యాయం జరగకూడదు. పారూకి పిల్లలంటే ప్రాణం.

25:— రెండు రోజులు ప్రభు నన్ను తప్పించుకు తిరిగినా ఎలాగైతేనేం వాడిని పట్టుకున్నాను. 'ఐయామ్ సారీ, బ్రదర్!' అన్నాడు అచ్చమైన డాక్టర్‌లా. నా కన్నులలో నీళ్లు నిలిచేయి. 'టేక్ ఇట్ ఈజీ' అన్నాడు నన్ను ఓదారుస్తూ. ప్రాణప్రదమైన పారూని దూరం చేసుకోవాలంటే ... ఏమిటో బాధగా ఉంది. చనిపోతే బాగుండును.

26:— వదిన ముఖంలో కళే లేదు. ఇక పిల్లలు కలగరనే నిరాశే ఆమెని పీల్చి పిప్పిచేసింది. పారూ ఈ చిత్రవధకి గురి కాకూడదు. స్నేహంలో మోసాన్ని భరించలే నంటుంది, పారూ. కాని, ఈ విషయం ఎలా చెప్పను? నేను అసమర్థుడినని ఎలా చెప్పాలి? ! !

27:— అప్పుడెప్పుడో సరదాకి నేవీలో జాబ్‌కి అప్లై చేసేను. అది ఇప్పుడు ఫలించింది. వెంటనే జాయినవమని ఆర్డర్సు వచ్చేయి. ఇదీ ఒకందుకు మంచిదే. పారూకి దూరం అయేందుకు మొదటి మెట్టు. వదిన ఒప్పుకోలేదు. 'నీకు పెళ్లి చెయ్యాలని ఢిల్లీ నుంచి ఇక్కడికి వస్తే ఇదేమిటయ్యా రాజా, ఇప్పుడువద్దనడం?' అంది నిష్ఠూరంగా. అన్నయ్య కూడా ఇష్టపడలేదు. నాకుమాత్రం ఇష్టమా పారూని కాదనడం? నేను కాదూ లెటర్ వ్రాసి వారిని పిలిపించింది? !! జీవితంలో లభ్యం కానివి కొన్ని ఉంటాయి.

28:— నిండు పౌర్ణమి. పారూ నా ఒడిలో వాలి కెరటాలను చూస్తూంది. పారూ దేవత. 'రాజా! నేను తెలివి తక్కువగా ఎప్పుడైనా పోట్లాడితే మాట్లాడటం మానేసి శిక్షించవు కదూ?' అంది నా కళ్లలోకి చూస్తూ. ప్రేమించబడడం ఎంత అదృష్టం! ఆ ప్రేమని నాది చేసుకోలేని నిర్భాగ్యుణ్ణి! 'రాజా! ఈ వారం రోజులు ఎంత ఏడ్చేనో నీకు తెలియదు. మరెప్పుడూ ఇలా ఏడిపించనని ఆ వెన్నెల సాక్షిగా చెప్పు, రాజా!' అంది. పారూ కళ్లలో తడి చూసేక ఇక ఈ రోజుకి ఉద్యోగ విషయం చెప్పలేననిపించింది. 'పారూ! నీ రాజు ఏ తప్పు చేసినా నువ్వు క్షమించగలవు?'

29:—పారూ ఏదో చదువుకుంటూంది. నన్ను చూడగానే పరుగున వచ్చింది. వెన్నెలలో మౌనంగా సముద్రం వరకూ నడిచేం. అలా మౌనంగా నడవడం పారూకి ఇష్టం. నా పాదాల దగ్గర కూర్చుని, 'రాజా!' అంది. ఆమె చెప్పబోయే దేమిటో నాకు తెలుసు. 'పాట పాడు, రాజా!' అంది. 'మనిషి పోతే మాత్రమేమి?

## నిక్ నేమ్

ఒకరిని అపహాస్యంపాలు చేయడానికి ఒక 'నిక్ నేమ్' తగిలించడంకంటే, పెద్ద బండరాయి, అతని నెత్తిన వేయటం మేలు. దెబ్బ ఒక్కసారి, ఒక్కచోట తగులుతుంది. 'వ్యంగ్య నామం' జీవితాంతం వెన్నాడి బాధపెడుతుంది.

— అనాన్

మనసు ఉండదు.' నా మనసులోని మాటలు పాట రూపంగా వచ్చేయి. పారూ కళ్లలో నీళ్లు నిలిచేయి. 'రాజా! నువ్వు లేని నేను లేను' అంది ఆవేశంగా. తప్పు, పారూ! అలా అనకూడదు' అన్నాను.

30:— పారూకి నా జాబ్ విషయం చెప్పేను. ముందు తెల్లబోయింది. తరవాత భోరున ఏడ్చింది. కాసేపు పోయేక నవ్వి 'నేనూ వస్తా' నంది. చాలాసేపు బ్రతిమాలి ఒప్పించేను. పెళ్లి గురించి అడగడానికి సిగ్గుపడింది. ఎంత అరమరికలు లేని స్నేహమయినా, స్త్రీ తనంత తానుగా తన వివాహం గురించి మాట్లాడ లేదు కాబోలు. 'రాజా! ఎప్పటికీ నేను నీ దానినే' అంది పారూ భావగర్భితంగా. మొదటిసారిగా, చివరిసారిగా నా పారూని ముద్దుపెట్టుకున్నాను. ఈ క్షణం నుంచి నాది అనుకున్న పారూ నాది కాదు. పారూని మరిచి పోవాలి. శరీరంలో ఒక భాగాన్ని నరికివేయాలంటే బాధగానే ఉంటుంది. కాని, ఆ భాగం వల్ల శరీరానికే నష్టం అంటే డాక్టర్లు తీసిపారేయరూ? నా పారూ కోసమే మనసు చంపుకుంటున్నాను.

31:— అన్నయ్యకి నమస్కరిస్తుంటే రెండు కన్నీటి బొట్లు నా తలమీద పడ్డాయి. వదిన చిన్న పిల్లలా ఏడ్చింది. పారూ నా చెయ్యి పట్టుకొని మరేం మాట్లాడలేకపోయింది,

1:— ఆమె 'శ్రీకాంత్' ఇస్తూ అంది. 'రాజ్యలక్ష్మి కంటే ఎక్కువగా నిన్ను ఆరాధిస్తున్నాను. ఆరాధనకి అర్థం తెలిస్తే నన్ను మరిచిపోవు. ఎన్నాళ్లయినా ఇక్కడే, ఇలాగే నీ కోసం ఎదురు చూస్తాను' అంది నవ్వాలని ప్రయత్నిస్తూ. పారూ నాకు ఎన్నో సార్లు ఎన్నో బహుమతు లిచ్చింది. కాని, తనకి నే నేమివ్వ గలను? 'నాకోసం నిరీక్షించు, పారూ! నీకోసం తప్పక వస్తాను' అని కూడా చెప్పలేని నిర్భాగ్యుడిని. ఆమె నా వెనకే నడిచి వస్తుంటే ఘల్లుఘల్లు మనే ఆమె పాదాల అందెల చప్పుడు 'వెళ్లకు, రాజా!' అన్నట్టే ఉంది. సీల జారిపోయి ఆమె కాలి అందె కింద పడిపోతే తీసి జేబులో దాచుకున్నాను. 'ఎందుకు?' అంది పారూ అందంగా నవ్వుతూ. 'నిన్ను పూజించేందుకు' అని అనాలనిపించినా అనలేదు. స్నేహితు లందరి కళ్లలో నీళ్లు నిండేయి నా ఎడబాటుకి. అంతమందిని ఏడిపించి వెళ్లకపోతే ఏం? అనిపించింది. కాని, ఈ ఎడబాటు అనివార్యం. పారూని వారందరికీ అప్పగించి రైల్లో కూర్చున్నాను.

అబ్బ! ఒక్కొక్కరి జీవితం వెనుక ఒక్కొక్క గాథ. పాపం, రాజు! నాకు జాలనిపించింది. ఇక డైరీ చదవా లనిపించలేదు. డైరీలో ఒక మూల పారూ అడ్రెస్ దొరికింది. పారూ భీమ్లాలో ఉంది. ఎలా ఉందో ఏమో! రాజూ మోసగా డనుకొని మరొకర్ని పెళ్లి చేసుకుందేమో? ఒక్కసారి పారుని చూస్తే బాగుండును. ట్రైము చూస్తే మూడయింది. పెట్టె జాగ్రత్తగా మంచం క్రింద పెట్టి మంచం మీద వాలేను. ఆలోచిస్తున్న నాకు హఠాత్తుగా వినయ్ గుర్తు వచ్చేడు. చాలా రోజుల నుంచి వినయ్ భీమ్లాలోనే ఉన్నాడు పొలాలు చూసుకుంటూ. వాడికి పారూ సంగతి తెలియ కుండా ఉంటుందా? రేపు ఒకసారి భీమ్లా వెళితేనో? !! వెళ్లి రావాలి. లేకపోతే ఈ సందేహాస్పదాలలో కొట్టుకు పోవడం ... మనసు పాడుచేసుకోవడం ఏంబాగుంటుంది? తప్పక వెళ్లాలి అనుకుంటే రిలీఫ్‌గా ఫీలయేను.

సుమిత్రకి లెటర్ పోస్టు చేసి, ఆఫీసుకి లీవ్ లెటర్ పారేసి, గోపీ ఇంట్లో నాలుగు మెతుకులు కొరికి, నీలిమా దేవి దగ్గర సెలవు తీసుకొని భీమ్లా బయలు దేరేను. వినయ్ ఇల్లు గుర్తుపట్టడం అంత కష్టం కాలేదు. అక్కడికి చేరేసరికి వివిధ భారతి నుంచి కాబోలు 'జిందగీ ఏక్ సఫర్ హై సుహానా!' అంటూ కిషోర్‌కుమార్ గొంతు వినిపిస్తోంది. 'వినయ్!' అని పిలిచేను గుమ్మంలో నిలిచి.

"ఓ! మురళీ! నువ్వా! రా! రా! చాలా రోజులకి కనిపించేవు" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించేడు వినయ్. "ఏమిటి విశేషం! ఇన్నాళ్ల తరవాత ఈ పేద మిత్రుడు గుర్తు వచ్చేడు శ్రీకృష్ణుల వారికి!" అన్నాడు తమాషాగా నవ్వుతూ.

తీయని స్నేహానికి తల వంచి నమస్కరించాలనిపిస్తుంది ఎప్పుడూ.

"బాగుందిదా! నీలా కాకుండా ఒకరికి తల అమ్ము కుని బ్రతికే వాళ్లం. మా కెలా వీలవుతుంది, చెప్పు?" అన్నాను. వాడు నవ్వేసేడు. వాడు మారినా వాడి నవ్వు మారలేదు.

"పారూ! కొంచెం కాఫీ తే, అమ్మా!" వినయ్ గట్టిగా అరిచి చెప్పేడు.

నేనెంత అదృష్టవంతుడిని! పారూ ఇక్కడే ఉందన్న మాట. వెదకబోయిన తీగె కాలికి తగలడం అంటే ఇదేనేమో? నా మనసు ఆనందంతో గెంతులుపెట్టింది. పారూ అజంతా సుందరి. ప్రబంధ నాయిక. చెంపకి చేరడేసి కళ్లతో, కాలు కదిపితే ఘల్లుఘల్లుమనే అందెల చప్పుడుతో మెరుపులా మెరిసిపోయే పదునెనిమిది సంవత్సరాల యువతి నా మనోనేత్రం ముందు ప్రత్యక్షమయింది. నేను ఊహించుకున్నట్లే ఘల్లు ఘల్లు మన్న అందెల చప్పుడు వినిపించింది. క్రీగంట చూసేను. ఆ వచ్చినది పది సంవత్సరాల పాప. ఉస్సురు మనిపించింది. కాఫీ చప్పరిస్తూ ఆ పాపని చూసేను. నేను అనుకున్నట్టే చెంపకు చేరడేసి కళ్లు, నుదుట దోసగింజ ఆకారంలో బొట్టు. పెద్ద అయితే భువన మోహనంగా ఉంటుం దనిపించింది.

"మా పెద్ద అమ్మాయి లక్ష్మి పార్వతి. మాతో


రామతీర్థ బ్రాహ్మీ ఆయిల్

స్పెషల్ నం. 1 రిజిస్టర్డు

చుండ్రు, జుట్టు రాలిపోవుటను నివారించే ఒక అమూల్యమైన ఓషధిక్రుతమైన తలనూనె. ఇది విలువయైన అనేక దినుసులతో శాస్త్రీయంగా తయారు చెయ్యబడినది. మెదడును చల్లబరచి ఆరోగ్యాన్ని అభివృద్ధి పరచి, సుఖనిద్ర నిస్తుంది. శరీర మార్దవతకు మిక్కిలి ఉత్తమమైనది. ప్రతి వారికి అన్ని ఋతువులలోను ఉపయోగమైనది.

ప్రతిచోటా లభిస్తుంది

శ్రీ రామతీర్థ యోగాశ్రమం,

దాదర్, సెంట్రల్ రైల్వే, బొంబాయి - 14. ఫోన్: 442899





పోతే, మీ నాన్న చెప్పినట్లు నువ్వా పెళ్ళి చేసుకుంటే నీకూ ఇంత పాప ఉండును" అన్నాడు వినయ్ నవ్వుతూ.

"అదేమిటోయ్, రెండు పేర్లు పెట్టావ్?" అన్నాను నవ్వి.

"తరవాత చెబుతాలే. ముందు కాఫీ త్రాగు" అంటూ వాడు ఇంట్లోకి వెళ్ళేడు.

"వాడు నా ప్రాణ స్నేహితుడు. ఒకసారి కనిపించడానికి సిగ్గెందుకు, పూర్ణిమా? మన పెళ్ళిలో తెగ అల్లరి చేసేడు గుర్తులేదూ!" అంటున్నాడు వినయ్.

నాకు నవ్వు వచ్చింది. స్త్రీ భర్తతో తప్ప మరెవ్వరితో మాట్లాడడానికి అంతగా ఇష్టపడదు, ఎందుకనో అనుకున్నాను.

"వంటలో ఉన్నాను. ఆ తరవాత భోజనానికి వస్తారుగా? అప్పుడు మాట్లాడతాను. వంట ఏం చెయ్యాలో చెప్పండి." అతి నెమ్మదిగా అంటున్న ఆమె కంఠం వీణ మీటినట్లుంది. నాకు పిలిమాదేవి గుర్తు వచ్చింది. ఏ అరమరికలూ లేకుండా 'అన్నయ్యా!' అంటూ ఆప్యాయంగా మాట్లాడుతుంది. ఒక్కొక్కరి స్వభావం ఒక్కొక్కలా ఉంటుంది.

"సరే! నీ ఇష్టం. కొంచెం పాయసం చేసి పులిహోర కూడా చెయ్యి. వాడికి ప్రాణం" అన్నాడు వినయ్.

అబ్బ! వీడికి నా అలవాట్లు, ఇష్టాలు ఇంకా గుర్తు ఉన్నా యన్న మాట. ఇటువంటి మిత్రులను పొంద గలిగిన నా అదృష్టానికి నన్ను నేను అభినందించుకున్నాను. ఇద్దరం అలా బీచ్ వైపు బయలుదేరేం.

"పూర్ణిమకి తగని సిగ్గురా, మురళీ! ఆ సిగ్గు లేక పోతే అన చేత పాటకచేరీలు చేయిద్దామని ఉంది. నా దగ్గర తప్పితే మరెక్కడా పాడదు; కనీసం మాట్లాడదు కూడా, ఒక్క రాజాతో తప్పితే" అన్నాడు.

రాజా పేరు విని ఉలిక్కిపడ్డాను. 'ఎంతమంది రాజాలో! బహుశా పూర్ణిమ వాళ్ళ బంధువు ఏమో?' అనుకున్నాను. నీరెండ పడి సముద్రం మెరుస్తోంది. ఇసుకలో ఎవరూ లేని చోట కూర్చున్నాం. ఇక ఆగలేక అడిగేసేను—"నీకు పారూ తెలుసురా?" అని. వాడి ముఖంలో మారిన రంగులు చూసి భయపడ్డాను.

"ఏ పారూ?" అన్నాడు కఠినంగా. వాడిలో నిమిషం క్రితం ఉన్న ప్రసన్నత మాయమయింది.

"అదే! మీ ఊర్లో రాజా అనే అతను ఉండేవాడు. ఇప్పుడు నేవీలో పనిచేస్తున్నాడు."

"నీకు రాజా కనిపించేడా? ఎక్కడ?" ఆత్రంగా అడిగేడు.

"ఆహాఁ కనిపించలేదు. అసలు రాజా ఎలా ఉంటాడో కూడా నాకు తెలియదు. ఊరికే పారూ గురించి తెలుసుకోవాలని" అన్నాను తడబడుతూ, "ఒక ఆడదాని గురించి నీ కెందుకూ? అసలు ఆమె నీ కెలా తెలుసు?" అంటాడేమోనని.

"పారూ నీ కెలా తెలుసు?" అనుమానంగా అడిగేడు. వాడి కళ్ళలో ఎర్రజీర కనిపించింది.

ఇక లాభంలేదని జరిగిందంతా దాచకుండా చెప్పి, "ఇప్పుడు చెప్పు, పారూ ఎక్కడ ఉందో. ఊరికే ఒక్కసారి చూడాలని ఉంది" అన్నాను.

వాడు చాలాసేపు మాట్లాడలేదు. చంద్రుడు సముద్ర గర్భంలోంచి బయటికి వచ్చేడు. పౌర్ణమినాటి సముద్రం చూడాలనుకోవడమే కాని ఎప్పుడూ చూడలేదు. కన్నుల పండువగా ఉంది. అతన్ని అందుకోవాలని సముద్రం వ్యర్థ ప్రయత్నం చేస్తోంది.

"పారూ నిజంగా పార్వతేరా, మురళీ!" వాడి మాటలకి ఇటు తిరిగి చూసేను. వాడి కళ్ళలో తడి కనిపిస్తోంది.

"నేను ఒకటి చెబుతాను వినరా, మురళీ! మగవాడికి తన తల్లీ, స్వంత సోదరీ తప్పితే ఏ స్త్రీ అయినా ప్రియురాలి లాగే కనిపిస్తుంది. అవకాశం దొరుకుతుందా అని చూస్తాడు. అయితే, రామచంద్ర ప్రభువులు ఒకరో ఇద్దరో ఉంటారనుకో. అది వేరే విషయం. కాని, మా పారూని చూస్తే అందరికీ సోదరీ భావమే. గలగల పారే సెలయేరు వంటిది పార్వతి. ఊర్లో అందరికీ చెల్లెలే, ఒక్క రాజాకి తప్ప. ఆమె ఈ ఊరి ఆడపడుచు. పాపం, చిన్నప్పుడే తల్లితండ్రులు పోయేరు. ఆ చరిత్రంతా ఎందుకు? కాని, పారూ అమ్మమ్మ అల్లారు ముద్దుగా పెంచింది. ఇంతై, అంతంతై అజంతా బొమ్మలా తయారైంది. పారూ సంగీత సరస్వతి. ఆమె చదవని ప్రబంధమూ లేదు, నవలా లేదు. పారూ ఒక విధంగా మా ఊరి దేవత. ఆమెని చూస్తే ప్రతి ఒక్కరికీ నమస్కరించాలనిపిస్తుంది. ప్రతి రోజూ షికారుకి వెళ్ళే రాజాని, పారూని చూస్తే ఏమనిపించేది కాదు. 'వారిద్దరిదీ జన్మ జన్మల అనుబంధం' అనుకునే వాళ్ళం.

ఇదే చోట వాళ్ళిద్దరూ గంటలు గంటలు గడిపే వారు. అయినా, ఎవరూ ఏ మనేవారు కారు. ఫాల్గుణ మాసంలో పెళ్ళిచెయ్యాలని రాజా వాళ్ళ అన్నయ్య, వదిన ఢిల్లీ నుంచి వచ్చేరు. పారూ పెళ్ళికి ఎంత పందిరి వెయ్యాలో, ఏమేం చేయించాలో చర్చించుకుంటున్నాం తీరిక వేళల్లో, స్నేహితుల మందరం కలిసినప్పుడు. ఒక నాడు హఠాత్తుగా రాజాకి ఉద్యోగం వచ్చిందని చెప్పి వెళ్ళిపోయేడు. పారూ మౌనంగా ఊరుకోవడం ఆశ్చర్యమనిపించింది.

"రాజా వెళ్ళిపోయినా పారూ ఇదే చోట సముద్రంలోకి చూస్తూ కూర్చునేది."

"అదేం? ఇప్పుడు ఇక్కడికి రావడం మానేసిందా?" అన్నాను ఆత్రంగా. నా ఆత్రానికో ఏమో వాడు నవ్వేడు. "చెప్పేది వినరా, ప్రశ్నలు వేయకుండా" అన్నాడు చిరాగ్గా.

"ఊఁ. సరే చెప్పు" అన్నాను బుద్ధిగా కూర్చుని.

"ఎవరైనా ఇటు వస్తే చీకటి పడిపోయింది రా అమ్మా, పోదాం" అని పిలుచుకు వచ్చేసే వాళ్ళం. రాజా అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తున్నా పారూ ఇక్కడ నిరంతరం తనకోసం ఎదురుచూస్తూ ఉంటుందన్న మాటే మరిచిపోయేడు. ఒక రోజు నేను పట్నం వెళుతుంటే పారూ మా ఇంటికి వచ్చింది.

"ఏమమ్మా, పారూ! పట్నం వెళుతున్నాను. రాజాకేమైనా చెప్పనా?" అన్నాను నవ్వుతూ.

"మా పారు చిక్కి శల్యమై పోతోంది, విరహం భరించలేక. త్వరగా నీ దర్శన భాగ్యం కలిగించవయ్యా, రాజా, అని చెప్పండి" అంది పూర్ణిమ.

పారూ కిలకిలమని నవ్వింది. పారూ వైపు చూసేను. 'నిజమే. పారూ ఇక ఎంతో కాలం బ్రతకదు' అనిపించింది. ఆ కళ్ళలో వెలుగే మాయమయింది. 'మనోవ్యాధికి మందు లేదు' అంటా రందుకే నేమో!

"రాజాని ఒక్కసారి కనిపించి వెళ్ళమను, అన్నయ్యా!" అంది పారూ!

"నువ్వు బెంగపడకు, పారూ! వీలయితే ఈ రాత్రికే రాజాని తీసుకువస్తాను" అన్నాను భరోసా ఇస్తూ. ఆమె కళ్ళలో వెయ్యి జ్యోతులు వెలిగేయి. రాజాకి ఇష్టమైన పూతరేకులు నా చేతుల్లో ఉంచి, "మరెవ్వరికీ ఇవ్వకుండా రాజానే తినమను, అన్నయ్యా" అంది పారూ.

అంత ఆపేక్ష పారూకి రాజంటే? వాడు చెప్పడం ఆపి, "ఇక పోదాంరా! మురళీ! పూర్ణిమ మనకోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అన్నాడు.

"బలేవాడివే! మధ్యలో ఆపేస్తా వేమిటి? నువ్వు రాజా దగ్గరికి వెళ్ళేవా? రాజా ఏమన్నాడు?" అన్నాను ఆసక్తిగా.

నా పట్టుదల చూసి నవ్వేడు. "మరొకరి విషయాలు తెలుసుకోవడంలో నీ కుండే ఆసక్తి ఇప్పటికీ పోలేదు. సరే! చెపుతాను. విను.

రాజా దగ్గరికి వెళ్ళేను. వాడు పెట్టె, బేడా సర్దుకొని ఎక్కడికో ప్రయాణం అవుతున్నాడు. నన్ను చూసి ముందు తెల్లబోయినా చిరునవ్వుతో ఆహ్వానించేడు.

'ఏరా, ఫూల్! పారూ బ్రతికి ఉందన్న సంగతే మరిచిపోయేవ్' అన్నాను పూత రేకులు అందిస్తూ.

'పారూ ఎలా ఉందిరా?' అన్నాడు వాడు ఆత్రంగా.

'పారూ చచ్చిపోతుందిరా! ఇక బ్రతకదు. ఎందుకిలా ఏడిపిస్తావ్?' అన్నాను.

వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'పారూకి నేను తగనురా, వినయ్!' అంటూ అంతా చెప్పి, 'అందుకే ఇక్కడి నుంచి వెళ్ళిపోతున్నాను. మనకి ఎంత ప్రియమైన వారైనా చనిపోతే ఏం చేస్తాం చెప్పు? నాలుగు రోజులు ఏడిచి మరిచిపోతాము. ఒకటి చెబుతాను వినరా, వినయ్! మనల్ని ఎదుటివారు ఇష్టపడుతున్నారు, అభిమానిస్తున్నారు, మనం కోరుకునే స్నేహం, ఆత్మీయత వారి దగ్గర లభ్యమౌతాయి అనే అభిప్రాయం ఉంటే, వారిని ఎప్పటికీ మరువలేం. వారి ఎడబాటు మనల్ని ఎంతయినా బాధిస్తుంది. ఒక్కోసారి ఆత్మీయుల ఎడబాటు వల్ల ప్రాణాలు కూడా పోవచ్చు. కాని, ఎదుటి వారు మనల్ని ద్వేషిస్తున్నారు, మన ఉనికిని నిర్లక్ష్యపరుస్తున్నారు అని అనుకుంటే వారు మనకి ఎంత ప్రియతమమైన వారైనా సరే, కొన్నాళ్ళకి కాకపోతే కొన్నాళ్ళకైనా మరిచిపోవడానికి ప్రయత్నిస్తాం. మరిచిపోతాం కూడా. అందుకేరా, వినయ్! పారూకి దూరంగా ఉండి, ఉత్తరాలు కూడా వ్రాయడం తగ్గించేసేను. ఎంత చూడాలని ఉన్నా అక్కడికి రావడం మానుకున్నాను. పారూకి ఆత్మాభిమానం ఎక్కువ. నన్ను తప్పక మరిచిపోతుంది. పారూ పెళ్ళయేక నేను తప్పక వస్తాను. అంతవరకూ ఈ అజ్ఞాతవాసం తప్పదు. పారూకి ఊరిలో అందరూ బంధువులే. ఊరి ఆడపడుచుగా చూసుకుంటారు మీరంతా. ఇక పారూకి లోటేమిటిరా?' అన్నాడు బాధగా.

'ఎన్ని ఉన్నా, ఎంత మంది ఉన్నా పారూకి నువ్వే

(తరువాయి 87 వ పేజీలో)

### మార్పు

అభిప్రాయాలు మార్చుకోలేని వ్యక్తి తన తప్పులను సరిదిద్దుకోలేడు. నేటి కంటె రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలంటే, మనిషిలో మార్పు అవసరం.

—ఎడ్వర్డ్

# పారూ నవ్వింది

(71 వ పేజీ తరువాయి)

కానాలిరా! నువ్వు లేకపోయేక ఆమెకి అంతా లోటేరా! రాజా!' అన్నాను. వాడి దగ్గరికి వెళ్లి నందుకు బాధే మిగిలింది నాకు. 'అడ్రెస్ ఇవ్వరా, రాజా, కనీసం!' అన్నాను. వాడు నవ్వి, 'ఎందుకురా, వినయ్? నేనే మీ అందరికోసం వస్తాను ఎప్పటికైనా. అంతవరకూ పారూకి ఈ విషయం చెప్పకు. చెబితే నా మీద ఒట్టే' అన్నాడు.

ఆ రోజు రాత్రి పారూ మా ఇంటికి వచ్చింది. 'రాజా బాగున్నాడా, అన్నయ్యా! పూతరేకులు బాగున్నాయన్నాడా? నా గురించి అడిగేడా?' రాజా గురించి మాట్లాడుతుంటే ఆమె కళ్లలో తళుకు చూసేక నాకు నోట మాట రాలేదు.

నా సమస్య పూర్ణిమ తీర్చింది. 'రాజా నిన్ను గురించి చాలా అడిగేడట, పారూ! నిన్ను చూడాలని మనసు కుతూహలపడిపోతోందట. సమయం చూసుకొని వస్తానన్నాడట.' ఇంకా ఏమేమో చెబుతూంది. ఆ అబద్ధాలు వినలేక అక్కడి నుంచి వచ్చేసేను. చాలా సేపు మాట్లాడి వెళ్లిపోయింది పారూ.

పారూని మోసం చేస్తున్నాననే భావం నన్ను నిలువునా తినేస్తూంది. అయినా, నిజం చెప్పలేక పోయేను.

పారూ అలా నిరీక్షిస్తూనే ఉంది. రోజులు, నెలలు గడిచిపోయేయి. ఆమె కళ్లలో నీళ్లు ఇంకిపోయేయి. వళుకే బంగార మయింది. ఆమె మానసిక పరిస్థితి మా ఊరి వాళ్లందరికీ తెలుసు. రాజా ఎక్కడికి వెళ్లేడో ఎవరికీ తెలియదు. లేకపోతే తన్ని తీసుకు వచ్చి మూడు ముళ్లూ వేయించే వారే. పారూ కళ్లలో కాంతి తగ్గిపోయింది. పిచ్చి చూపులు చూసేది. ఎవరు పట్నం వెళ్లి వచ్చినా — 'రాజా కనిపించేడా?' అని అడిగేది ఆత్రంగా. 'లేదు, కనిపించలేదు' అని ఎవ్వరూ చెప్పే వారు కాదు.

సరిగా ఆరు నెలల క్రితం. ఇదే పౌర్ణమి. ఇక్కడే కూర్చుని పారూ శూన్యంలోకి చూస్తూంది. ఇసుకతో గూళ్లు కట్టి, అవి నచ్చకపోతే క్రింద పడేసి మళ్లీ కట్టుకుంటూంది. ఊళ్లో దీపాలు వెలిగేయి. అటు వెళ్లిన వాళ్లూ, అట్నుంచి వస్తున్న వాళ్లూ 'చీకటి పడిపోయింది, పారూ? వచ్చేయ్!' అంటే నవ్విందట.

'నాకు భయమేమిటన్నయ్యా! కాసేపు ఉండి వచ్చేస్తాను' అందట.

రాత్రి పదయింది. పారూ ఇంకా రాలేదని వాళ్ల అమ్మమ్మ వచ్చి, 'పారూ ఇంకా రాలేదు' అని చెబితే ఆదరా బాదరాగా బీచ్ వైపు పరిగెత్తేం అందరమూ. బీచ్ పొడుగునా వెతికితే ఒక దగ్గర పారూ తెలివి తప్పి పడి ఉంది. ఆమె చుట్టూ ఉన్న సిగరెట్ పీకలు జరిగిన కథను చెప్పేయి. పారూని ఊళ్లోకి తీసుకు వచ్చేం. తెలివి వచ్చేక ఎన్నో విధాల అడిగితే నాలుగు వాక్యాలే చెప్పింది.

పారూ అలా సముద్రం వైపు చూస్తూ కూర్చుందట. ఎవరో ఆమె భుజం మీద చేతులు వేస్తే ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసిందట. ఆ మనిషిని ఈ ప్రాంతాలలో ఎప్పుడూ చూడలేదట. ఆ తరవాత ఏం జరిగిందో తనకి తెలియదట. మనిషి పశువుగా మారే ఘడియలు కొన్ని ఉంటాయిరా, మురళీ! అదిగో, ఆ ఘడియల్లోనే పారూ సర్వస్వం కోల్పోయింది. ఆ రోజు వాడు దొరికితే, మా ఊరి వాళ్లు వాడిని చంపి సముద్రంలో పారేసే వారే. మీ వంటి వారు ఈ వార్త వింటే ఏమంటారో తెలుసా? వయసులో ఉన్న ఆడకూతురు అలా బీచ్‌లో ఒంటరిగా కూర్చుంటే ఏమవుతుంది? అలా జరగవలసిందే! మంచి పని అయింది' అని అనక మానరు. కాని, మురళీ! మా ఊరు పారూకి ఇల్లు వంటిది. 'అన్నలు, తమ్ముళ్లు ఉన్న ఇంట్లో భయం ఎందుకు?' అనుకుందే కాని, పొరుగూరి వాళ్లకి తను చెల్లెలు కాదని తెలుసుకోలేకపోయిందిరా! 'మనది కాని వస్తువుని ముట్టుకోకూడదనే సంస్కారం లేని ఈ సమాజంలో పారూ అలా ఒంటరిగా తిరగడం తప్పే అనుకో. కాని ... ఏమిటో! మన పారూ అలా అయిపోయిందంటే బాధగా ఉండదూ? అప్పటి నుంచి పొరుగూరి నుంచి అపరిచితు లెవరు వచ్చినా పరీక్షగా చూడడం అలవాటయిపోయింది. నువ్వు పారూ గురించి అడిగితే కఠినంగా అడగవలసి వచ్చింది. మరేం అనుకోకు" అన్నాడు వినయ్ దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"పారూ ఇప్పుడు ఎక్కడ ఉందిరా?" అన్నాను నోరు పెగుల్చుకొని. ఏమిటో పారూ కథ విన్నాక చేదు తిన్నట్టు అయింది. క్షణికానందంకోసం జీవితాలను నాశనం చేసే నీచులకు చిత్రవధ తప్ప మరే శిక్షా లేదేమో?

"పారూ ఆ తరవాత రెండు రోజుల వరకూ రాజా ఫొటో చూస్తూ గడిపింది. మర్నాడు బీచ్‌కి వెళ్లిన పారూ ఇంటికి తిరిగి రాలేదు. పది గంటల తరవాత ఇటు వస్తే పారూ అదే చిరునవ్వుతో, అదే అలంకారాలతో కనిపిస్తూ ఉంటుందట. నేను ఎప్పుడూ చూడలేదనుకో. అది అంతా మన భ్రాంతే. పారూ చనిపోయిన రోజు అందరికీ కళ్లంబడి రక్తపు చుక్కలే కారేయి. అందరం పారూ పాదాలంటి, 'మా ఊరి దేవతవమ్మా, పారూ! నీ పేరు మా ఇంట్లో ఎవరికో ఒకరికి పెట్టుకుంటాం' అన్నాం. కాలం ఒక్క క్షణం ఆగి, 'ఇది మరొక విషాద గాథ' అని అనుకోవడం నాకు తెలుసు. ప్రకృతి అంతా మౌనంగా కన్నీరు కార్చింది. మా పాపలకి ఆమె పేరు పెట్టుకుని పారూ మాలోనే ఉందని తృప్తి పడడం నేర్చుకున్నాం. పారూ ఎప్పటికీ మాతోనే ఉంది. ఉంటుంది కూడా!" అన్నాడు వినయ్ బరువుగా.

ఇద్దరం కన్నీళ్లు తుడుచుకొని ఇంటిదారి పట్టేం. మాకు మాటలే కరువయేయి. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే పారూ తెల్ల చీరలో చిరునవ్వుతో చూస్తూంది. అది నా భ్రమే కావచ్చు. కాని, ఆమె నాలో చెరగని ముద్ర వేసింది. 'అబ్బ! ఇక్కడికి రాకపోతే ...? ఈ కథ వినకపోతే?' పారూ నా హృదయంలో సజీవమూర్తిగా నిలిచిపోయేది. అక్కడి నుంచి వచ్చేక పారూని చాలా రోజుల వరకూ మరువలేకపోయేను. సుమిత్ర "ఏమలా ఉన్నారు? మీ దిగులు నాకు చెప్పకూడనిదా?" అని అడిగితే, "జీవితాలు ఎంత అశాశ్వతమైనవి, సుమిత్రా! బుద్బుదప్రాయమైన జీవితం మీద ఆశలు పెంచుకోవడం అంత తెలివి తక్కువ పని మరొకటి ఉండదు" అన్నాను నిరాశగా.

సుమిత్ర నా ధోరణికి బెదిరిపోయింది.

'వద్దు! మీ రలా మాట్లాడకండి. మన పాపకోసమైనా మనం ఆశలు పెంచుకోవాలి' అంది కన్నీళ్లతో.

పాపకి పేరు పెట్టినప్పుడు బియ్యంలో ఏం పేరు వ్రాస్తానా? అని అందరూ ఆత్రంగా చూస్తుంటే 'పార్వతి' అని వ్రాసి తృప్తిగా నిట్టూర్చేను. చిన్నారి పారూని చూస్తుంటే ఇన్నాళ్లూ నాలో నిలిచిన నైరాశ్యం మాయమవసాగింది. పాప చుట్టూ ఆశలు అల్లుకోవడం ప్రారంభించేను.

శరత్ పార్వతి నన్ను మురిపించి, మరిపించి స్వప్న జగత్తులో ఉంచింది. రాజా పార్వతి నాలో దీపాలు వెలిగించి మరుపు రాని సజీవమూర్తి అయి, నా కుమార్తెగా వెలిసి నాలో వాత్సల్యాన్ని నింపింది. రేడియోలో లలిత సంగీతం వినిపిస్తూంది—'నల్లవాడా నే గొల్ల పిల్లనోయ్!' అంటూ. పారూ చివరిసారిగా రాజాకి వ్రాసిన లెటర్ డైరీలోంచి తీసేను. భీమ్లీ వెళ్లినప్పుడు వినయ్ ఆ లెటర్ నా కిచ్చి, "రాజా ముందు అక్కడికే వస్తాడురా! పారూ లెటర్ నువ్వే ఇయ్యి. నా నోటితో పారూ లేదని చెప్పలేను" అన్నాడు బాధగా.

"ప్రియమైన రాజాకి,

నా రాజా! నీ రాణి కావాలని ఎంతగానో తపించేను. నీకోసం బ్రతకాలని ఎంతో కోరికగా ఉంది. కాని, రాజా! మనం కావాలని కోరుకున్నది లభ్యం కాదు. ఈ రాత్రి నక్షత్రాలు మిణుకుమిణుకు మంటున్నాయి ఎప్పటి లాగే. ఆకాశం విల్లులా వంగి స్నేహ హస్తాలు చాచుతూంది. నా రాజా! ప్రకృతి నన్ను రా రమ్మని పిలుస్తూంది.

నువ్వు చేపట్టిన కార్యక్రమం ఏనాటికీ తరగనిది. అది పూర్తయే వరకూ ఇలా ఎదురుచూసే కంటే మరుజన్మ ఎత్తి పవిత్రమూర్తిగా నీ కోసం ఎదురు చూస్తాను. నా రాజా! ఎక్కడ ఉన్నా, ఏ రూపులో ఉన్నా నిన్ను గుర్తిస్తాను. నీ మీద మనసు తీరని ఈ ఆత్మకి చావు లేదు. భౌతికంగా నేను ఈ ప్రపంచాన్ని వీడినా, నా ఆత్మ మరో రూపంలో నీకై ఎదురు చూస్తుంది, రాజా! అప్పటివరకూ సెలవు. నీ పారూ కోసం అందమైన నీ కనులలో నీరు నింపకు. ఏమాత్రం అహంభావం లేని నువ్వు కోరుకునే పారూగా జన్మించి నీకై నేనే వస్తాను. నా రాజా! ఏనాడైనా నా ప్రవర్తనతో కష్టం కలిగిస్తే మన్నించు.

—జన్మజన్మలకీ నీకే అంకితమైన పారూ."

లెటర్ మడిచి డైరీలో ఉంచేను. కనులలో నీరు తిరిగింది. సంధ్య దీపం వెలిగించి సుమిత్ర కనుల కద్దుకుంటూంది భక్తిపూర్వకంగా. ఊయలలో నిద్రపోతున్న పాపకి మెలుకువ వచ్చింది కాబోలు, 'కేర్' మంటూ గుక్క పట్టి ఏడుస్తూంది. చప్పున వెళ్లి ఎత్తుకున్నాను.

'పారూ! నువ్వు ఎక్కడికీ పోలేదు. నువ్వు మాలోనే ఉన్నావమ్మా?' అనుకున్నాను తృప్తిగా. దూరాన జేగంటలు మ్రోగేయి, అవును, నిజం' అన్నట్టు.

చిన్నారి పారూ నన్ను చూసి నవ్వింది—ఎంతో అందంగా, మరెంతో మధురంగా. ★

## దైవత్వం

సృష్టి రహస్యాలను ఒక్కటొక్కటిగా తెలుసుకుంటూ, ఒక్కొక్క మెట్టుపైకి పోతే భగవంతుని చేరుకోవచ్చు

— మిల్టన్